J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 45 సంచిక : 43 27.3.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## జన'ఘన' నేత మోడీ



### దేశంలో అత్యధిక కాలం పాలన సాగించిన నాయకుడిగా రికార్డు

**తిరుగులేని చరిష్మాతో, అంతర్జాతీయ ఖ్యాతితో ఇప్పటికే అనేక రికార్డులు సొంతం చేసుకున్న ప్రధాని మోడీ, మరో అరుదైన మైలురాయిని అధిగమించారు. దేశంలో అత్యధిక కాలం పాలన సాగించిన నేతగా ఆయన ఘనకీర్తిని దక్కించుకున్నారు. తద్వారా 'జయహో మోడీ' అన్న నామాన్ని మరింత సార్థకం చేసుకున్నారు.**

వివరాలలోకి వెళ్తే... నరేంద్ర దామోదర్‌దాస్ మోడీ.. ప్రస్తుతం ఈపేరు తెలియని భారతీయుడు ఉండటంటే అతిశయోక్తి కాదేమో. ఎందుకంటే సాదాసీదా కుటుంబంలో పుట్టి అంచెలంచెలుగా ఎదిగి స్వాతంత్ర్య భారత చరిత్రలో ఏ ప్రధానికీ లభించని ప్రజా ఆమోదం, ప్రజా బలం మోడీ సొంతం చేసుకున్నారు కాబట్టి. గుజరాత్‌లోని వాద్‌నగర్‌లో 1950 సెప్టెంబర్ 17న జన్మించిన మోడీ, ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా, బీజేపీ నాయకుడిగా ఎదిగి గుజరాత్ ముఖ్యమంత్రిగా 2001 నుంచి 2014 వరకు పనిచేశారు. అభివృద్ధిలో గుజరాత్ రూపురేఖలను మార్చివేసి త్రీడీ మోడీగా

11లో




## పెరగనున్న సీట్లతో 2029లో...

## దేశంలో ఓట్ల పండుగ

- ఎంపీ, ఎమ్మెల్యే స్థానాల పెంపునకు కేంద్రం గ్రీన్ సిగ్నల్
- భారీగా పెరగనున్న అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాలు
- దేశవ్యాప్తంగా ద్వితీయ శ్రేణి నాయకులకు లబ్ధి
- తెలుగు రాష్ట్రాల్లోనూ ఆశావహుల జోరు

దేశ రాజకీయ చరిత్రలో 2029వ సంవత్సరం ప్రత్యేకంగా నిలిచిపోనుంది. ఆ ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికలు జాతీయ రాజకీయ యవనికపై కొత్త చరిత్రను లిఖించనున్నాయి. ఎందుకంటే 1972లో నిర్ణయించిన లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్యను 50 శాతం మేర పెంచి తొలిసారిగా భారీస్థాయిలో 2029లో ఎన్నికలను నిర్వహించనున్నారు. ఈమేరకు నియోజకవర్గాలను పునర్ వ్యవస్థీకరించడమే కాకుండా, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించి మహిళా సాధికారతకు నాంది పలకనున్నారు. అలాగే కొత్త జనాభా లెక్కల్లోని దామాషా ప్రాతిపదికగా ఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాలను నిర్ణయించనున్నారు. ఇక కొత్త పునర్ వ్యవస్థీకరణ చట్టం ప్రకారాం తెలుగు రాష్ట్రాల్లోనూ సీట్ల సంఖ్య (ఏపీలో 263, తెలంగాణలో 179) గణనీయంగా పెరగనుండడంతో కొత్త నియోజక వర్గాల్లో కర్చీఫ్ వేసేందుకు నాయకులు సిద్ధమైపోతున్నారు.

2లో

## ఆత్మబంధువుకి.. ఆత్మీయ అభినందనలు!



మానవీయ విలువలున్న మహోన్నత వ్యక్తి
నిత్యం దైవారాధనలో తరించే ఆధ్యాత్మిక దీప్తి
మా కుటుంబ కీర్తిని ఇనుమడింప చేస్తూ..
రేపటి తరాలకి స్ఫూర్తిగా నిలుస్తున్న
మా ఆత్మబంధువు, ఆత్మీయ సింధువు

మా **మహేష్**

105 సంవత్సరాల ఘనచరిత్ర కలిగిన
ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయం
"తిలక్ మహారాష్ట్ర విద్యాపీఠ్" నుండి
గౌరవ డాక్టరేట్ అందుకోవడం
మాకందరికీ గర్వకారణం.



భవిష్యత్తులో ఆయన ఇంకా అఖండ విజయాలు సాధించి.. అత్యున్నత శిఖరాలు అధిరోహించాలని
ఆ సాయినాథుని ఆశీస్సులు **మా మహేష్**కి ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షిస్తూ... **మా అభినందనలు.**

**మారంరెడ్డి ప్రసూనమ్మ** - అత్తమ్మ
**ఆనం మహేష్‌రెడ్డి** - తోడల్లుడు **ఆనం రాజి** - వదిన

## 82.50 లక్షలతో..

# పొట్టేపాళెంలో అభివృద్ధి పనులు



అభివృద్ధి పనులకి ప్రారంభోత్సవం చేస్తున్న కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ మండలంలోని పొట్టేపాళెం ప్రజలు ఎప్పటినుంచో కోరుకుంటున్న పొర్లుకట్టల ఆధునీకరణకు శ్రీకారం చుట్టామని, వరదలొచ్చినప్పుడల్లా ముంపునకు గురవుతున్న ఈ గ్రామానికి ఇక ముంపు ముప్పు ఉండదని టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి చెప్పారు. ఈనెల 25న ఆయన ఎంపీపీ విజయకుమార్, వేదగిరి క్షేత్రం ఛైర్మన్ ఇందుపూరు అచ్యుత్‌రెడ్డితో కలిసి 82.50 లక్షల రూపాయలతో పొట్టేపాళెంలో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పొట్టేపాళెం పొర్లుకట్టను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే నిర్మించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిల సారధ్యంలో ఈ గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. పొట్టేపాళెం కలుజు నిర్మాణం పనులు కూడా ఇప్పుడు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. దివంగత నేత ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, గ్రామస్తుల కోరిక మేరకు ఇక్కడ కమ్యూనిటీ హాలును నిర్మించామని, ఈ గ్రామానికి ఇంకా చేయాల్సిన అభివృద్ధి పనులు ఉన్నాయని, అవి కూడా రాబోయే రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. గ్రామాల అభివృద్ధి ప్రధాతగా నిలుస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలందరి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. గుండ్లపాలెం పిఏసిఎస్ సొసైటీ ఛైర్మన్ పముజుల ప్రదీప్, జడ్పీ కోఆప్షన్ సభ్యులు అల్లాబక్షు, సర్పంచ్ ఏడుకొండలు, ఎంపీటీసీ నెరెళ్ళ నారాయణ, నాయకులు హరియాదవ్, పొన్నాల రామచంద్రారెడ్డి, ముత్యాల సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులురెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 28 నుంచి.. కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు



ఆహ్వానపత్రికలని ఆవిష్కరిస్తున్న వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి

నెల్లూరు ఉస్మాన్ సాహెబ్‌పేటలో ఉన్న శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో ఈనెల 28 నుంచి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఉత్సవాల ఆహ్వాన పత్రికలను నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, పాలక మండలి సభ్యులు ఈనెల 25న ఆవిష్కరించారు. ఆలయ ఛైర్మన్ బీవీ శ్రీనివాస్, కార్పొరేటర్లు కిన్నెర ప్రేమ్‌కుమార్, కర్తం ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మాతృమూర్తి సేవా పురస్కారాలు



నెల్లూరుజిల్లా అల్లూరు గ్రామ వాసి, ప్రస్తుతం విశాఖ నివాసి మేడా మస్తాన్‌రెడ్డి తాము ఏటా నిర్వహిస్తున్న 'మాతృమూర్తి సేవా పురస్కారాల' కార్యక్రమాన్ని ఇటీవల విశాఖలో నిర్వహించారు. మాతృమూర్తిని సేవిస్తున్న పలువురికి అక్కడి పౌర గ్రంథాలయంలో పురస్కారాలను ప్రదానం చేశారు. తమ తల్లి మేడా బుజ్జమ్మ స్మారకంగా వారికి సన్మానాలు చేశారు. ట్రస్ట్ ఛైర్మన్ మేడా మస్తాన్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు మేడా పద్మావతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సెంచూరియన్ విశ్వవిద్యాలయం గౌరవ కులపతి ప్రొఫెసర్ డా. జి.ఎస్.ఎన్.రాజు పాల్గొని ట్రస్ట్ సేవలను అభినందించారు. పురస్కారాలందుకున్న వారిలో బోను వెంకట అప్పారావు, నంబాల సూర్యనారాయణరావు, రాపేటి శ్రీను, కొప్పోలు మాధవ్, ఇందిరా సాహిణి ఉన్నారు. ప్రధానవక్తగా కేంద్ర సాహిత్య అకాడమీ భాషా సమ్మాన్ పురస్కార గ్రహీత ఆచార్య బేతవోలు రామబ్రహ్మం తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# క్రీడాభివృద్ధి అధికారిగా..జసీం



జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ)గా అథ్లెటిక్ కోచ్ జసీంని నియమిస్తూ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఈనెల 25న ఉత్తర్వులిచ్చింది. ఆమేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు కూడా. ఈ స్థానంలో ఇప్పటివరకు ఉన్న పాండురంగారావు వ్యక్తిగత కారణాలతో బాధ్యతల నుంచి తప్పుకోవడంతో, జసీంని కొత్త అధికారిగా నియమించారు.

# 2029లో దేశంలో ఓట్ల పండుగ

(మొదటిపేజీ తరువాయి)

ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్, ఈమేరకు పార్లమెంటరీ ప్రాతినిధ్యాన్ని మరింత విస్తృతం చేయనుంది. అత్యధిక జనాభా కలిగిన దేశంలో ఇప్పటికే 98కోట్ల పైచిలుకు ఓటర్లున్నారు. వీరందరికీ బాధ్యత వహించే ప్రజా ప్రతినిధుల సంఖ్యను దేశం మొత్తం మీద పెంచనున్నారు. ప్రస్తుత రాజ్యాంగం ప్రకారం లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్రపతిని కలిపి భారత పార్లమెంట్‌గా అభివర్ణిస్తున్నారు. అయితే దిగువ సభ అయిన లోక్‌సభ ప్రాతినిధ్యాన్ని బట్టే భారత ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్ణయిస్తారు. ఎందుకంటే లోక్‌సభ ఎంపీలను మాత్రమే భారత పౌరులు ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు. ఇక రాజ్యసభ, రాష్ట్రపతి ఎన్నికల్లో కేవలం ఎన్నికైన ప్రజా ప్రతినిధులు మాత్రమే ఓట్లు వేస్తారు. భారత పౌరులు ప్రత్యక్షంగా ఈ ఎన్నికల్లో పాలు పంచుకోరు. అందుకే లోక్‌సభలో ప్రజా ప్రాతినిధ్యాన్ని పెంచాలని, నియోజకవర్గాలను పునర్ వ్యవస్థీకరించాలని, నియోజకవర్గాల సంఖ్యను జనాభాకు అనుగుణంగా పెంచాలని ఎప్పటినుంచో డిమాండ్లు వినిపిస్తున్నాయి. అయితే 2011 తర్వాత దేశంలో జనాభా లెక్కల సేకరణ చేపట్టక పోవడంతో డీలిమిటేషన్ వ్యవహారం ఎప్పటికప్పుడు వాయిదాపడుతూ వచ్చింది. అయితే తాజాగా లోక్‌సభలో, రాష్ట్రాల శాసనసభల్లో సీట్ల సంఖ్యను ఇప్పుడున్న సంఖ్యలో 50 శాతం వరకు పెంచాలని ఇటీవల కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు కొత్త జనాభా లెక్కల ప్రాతిపదికగా ఎక్కువమంది ప్రజలకు న్యాయం చేయాలని, అందుకోసం చట్టసభల్లో ప్రజాప్రతినిధుల సంఖ్యను పెంచాలని భావిస్తోంది.

## పునర్ వ్యవస్థీకరణ చరిత్ర చాంతాడంత!

నిజానికి భారత రాజ్యాంగం రచించే సమయానికి దేశంలో 14 రాష్ట్రాలు ఉన్నాయి. ఆ తర్వాత భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటుకు పార్లమెంట్ నిర్ణయించింది. ఈ క్రమంలో చాలాచోట్ల వేర్పాటువాదాలు తలెత్తడం, దేశంలో అనూహ్యంగా జనాభా అంతకంతకూ పెరిగిపోవడం, ప్రతి పదేళ్లకోసారి పునర్ వ్యవస్థీకరణ కమిషన్ ఏర్పాటు చేసి నియోజవర్గాల సంఖ్యను నిర్ణయించడం భారత ప్రభుత్వానికి తలకుమించిన భారంగా మారింది. ఇదే సమయంలో ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతున్న జనాభాను కట్టడి చేయాలంటే కుటుంబ నియంత్రణ ఒక్కటే మార్గమని అప్పట్లో నిర్ణయించారు. ఇలాంటి సమయంలో జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల సంఖ్యను ఆయా రాష్ట్రాలకు కేటాయిస్తే, రాష్ట్ర ప్రభుత్వాలు కుటుంబ నియంత్రణను పక్కాగా అమలు చేసే అవకాశం ఉండదని నిపుణులు సూచించారు. దీంతో ఇందిరాగాంధీ ప్రభుత్వం 1971 జనాభా లెక్కల ప్రకారం ఆయా రాష్ట్రాలకు 1973 పునర్వ్యవస్థీకరణ చట్టం ద్వారా జనసంఖ్యను బట్టి లోక్‌సభలో ప్రాతినిధ్యం నిర్ణయించింది. తద్వారా కుటుంబ నియంత్రణ కఠినంగా అమలుచేసే రాష్ట్రాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా మరో 25ఏళ్ల (2002 వరకు) నియోజకవర్గాలను పునర్ వ్యవస్థీకరించబోమని స్పష్టం చేసింది. ఇందుకోసం 1976లో 82వ రాజ్యాంగ సవరణను కూడా చేపట్టింది. దీంతో దక్షిణాది రాష్ట్రాలైన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక కుటుంబ నియంత్రణను నిక్కచ్చిగా అమలు చేశాయి. తద్వారా దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా గణనీయంగా తగ్గింది. అయితే, ఉత్తరాది రాష్ట్రాల్లో మాత్రం జనాభా నియంత్రణ అనుకున్నంత స్థాయిలో సక్సెస్ కాలేదు. ఫలితంగా 2002 తర్వాత చేపట్టే నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణలో జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాలను కేటాయిస్తే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని స్టాలిన్, చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, పినరాయ్ విజయన్, సిద్ధరామయ్య వంటి నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో 2001లో అప్పటి వాజ్‌పేయ్ ప్రభుత్వం ఆయా రాష్ట్రాల్లో లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్యను యథాతథంగా ఉంచి నియోజకవర్గ సరిహద్దులను మాత్రం మార్చే విధంగా పునర్వ్యవస్థీకరణ చేపట్టింది. తద్వారా కొత్త జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్యను పెంచే నిర్ణయాన్ని మరో 25 ఏళ్ల (2026 వరకు) వాయిదా వేసింది.

## ఒక్క నిర్ణయంతో అనేక సమస్యలకు చెక్!

ఆ తర్వాత మోడీ ప్రభుత్వం 2021లో జనాభా లెక్కలు చేపట్టలేదన్న సాకుతో తొలుత నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణకు వాయిదా వేసింది. అయితే ఉత్తరాది రాష్ట్రాల నుంచి డిమాండ్లు పెరుగుతున్న క్రమంలో దక్షిణాది నాయకులు పునర్ వ్యవస్థీకరణలో అన్యాయం జరిగితే పోరాటాలు తప్పవని హెచ్చరించారు. తమిళనాడు సీఎం స్టాలిన్ ఏకంగా 12 పార్టీల ప్రతినిధులతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని ప్రత్యేక సమావేశం కూడా నిర్వయించారు. ఇదే సమయంలో చంద్రబాబు వంటి నేతలు తగ్గుతున్న జనాభాను మళ్లీ పెంచేందుకు ప్రతి జంట ముగ్గురు బిడ్డలకు తక్కువ కాకుండా జన్మనివ్వాలని, మూడోబిడ్డను కనే జంటకు ప్రోత్సాహకంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.25 వేలు అందిస్తుందని కూడా ప్రకటించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఏ రాష్ట్రానికి అన్యాయం జరగకుండా మోడీ ప్రభుత్వం అద్భుత నిర్ణయం తీసుకుంది. లోక్‌సభలో ఆయా రాష్ట్రాల ప్రాతనిధ్యాన్ని అలాగే ఉంచి మొత్తం స్థానాల సంఖ్యను ఇప్పుడున్న సంఖ్యలో 50శాతం పెంచాలని భావిస్తోంది. ఇదే జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు ముప్పు తప్పినట్లేనని విశ్లేషకులు వ్యాఖ్యనిస్తున్నారు. కొత్త పునర్ వ్యవస్థీకరణ చట్టం ప్రకారం నియోజకవర్గాల ప్రాతిపదికగా దేశంలో మొత్తం లోక్‌సభ సభ్యుల సంఖ్య ప్రస్తుతం ఉన్న 543 నుంచి 816కు పెరగనుంది. మొత్తం అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య 4,123 నుంచి 6,185కు చేరనుంది. అలాగే 2023లో కేంద్రం ఆమోదించిన మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు కల్పించే చట్టం ప్రాతిపదికగా, మహిళలకు లోక్‌సభలో 270 సీట్లు రిజర్వ్ కానున్నాయి. అలాగే అన్ని రాష్ట్రాల అసెంబ్లీలలో మహిళా రిజర్వేషన్లు కలిగిన నియోజకవర్గాల సంఖ్య 2,042కు చేరనుంది. తొలుత దీన్ని 2034 సార్వత్రిక ఎన్నికల నుంచి అమలు చేయాలని భావించినా ఇప్పుడు 2029 ఎన్నికల్లోనే అమల్లోకి వచ్చేలా మోడీ ప్రభుత్వం తాజాగా పావులు కదుపుతుండడం గమనార్హం.

## తెలుగురాష్ట్రాలకు ఉగాది గిఫ్ట్!


2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయినప్పుడే, ఆంధ్రప్రదేశ్ రీ-ఆర్గనైజేషన్ యాక్ట్ ప్రకారం విభజిత ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో అసెంబ్లీ సీట్లు పెరగాల్సి ఉంది. అయితే 2020లో వచ్చిన కరోనా కారణంగా దేశంలో జనాభా లెక్కలు 2021లో కూడా చేపట్టకపోవడంతో ఈ ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం వాయిదా వేసింది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టులో కేసు వేసినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో తాజాగా దేశంలో నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ చేపట్టాలని మోడీ ప్రభుత్వం నిర్ణయించడం, ఈమేరకు కేంద్రమంత్రులు అమిత్‌షా, కిరణ్ రిజిజూ, అర్జున్‌రామ్ మేఘువాల్ అటు ఎన్డీయే పక్షాలు, ఇటు కాంగ్రెసేతర పక్షాలతో ఈ విషయంపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు కేంద్రం నిర్ణయాన్ని స్వాగతించాయి. మోడీ ఇచ్చిన ఉగాది గిఫ్ట్ అంటూ కొందరు నాయకులు ఆనంద తాండవం చేస్తున్నారు.

ఇక కొత్త పునర్ వ్యవస్థీకరణ చట్టం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఉన్న 175 నియోజకవర్గాలు 263కి, తెలంగాణలో ఇప్పుడున్న 119 నియోజకవర్గాలు 179కి పెరగనున్నాయి. అలాగే లోక్‌సభ సీట్లు ఏపీలో 25 నుంచి 38కి, తెలంగాణలో 17 నుంచి 26కి చేరుకోనున్నాయి. దీంతో ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీలతో పాటూ జనసేన, బీజేపీ, కమ్యూనిస్టులు, చివరికి ఏపీలో చచ్చిపోయిందనుకున్న కాంగ్రెస్ నుంచి కూడా ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు ఆశిస్తున్న నాయకులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. అంగ, అర్థ బలాలతో పాటూ సామదాన భేద దండోపాయాలతో తమ అధిష్టానాలను ప్రసన్నం చేసుకోవాలని, ఎలాగైనా భవిష్యత్‌లో ప్రొటోకాల్ గౌరవం పొందాలని పావులు కదుపుతున్నారు. ఇక ఆయా పార్టీల పెద్దలు సైతం సరైన అభ్యర్థులు, సరైన స్థానాల ఎంపికపై దృష్టి సారించి ఢిల్లీ స్థాయిలో తమ అర్థతలని, పలుకుబడిని మరింతగా పెంచుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. అలాగే కొత్త జిల్లాల ఏర్పాటు సమయంలో ఎదురైన ఇబ్బందులు సైతం తాజా పునర్వ్యవస్థీకరణ ద్వారా తొలగిపోతాయని భావిస్తున్నారు. ఎందుకంటే అవసరమైన మేరకు కొత్త నియోజకవర్గాలు, కొత్త మండల కేంద్రాలను ఎంపిక చేసుకునే వెసులుబాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలకి కొత్తచట్టంతో దక్కనుంది. దీంతో కుల సమీకరణలు, సామాజిక సమీకరణలు, ప్రాంతీయ ఆకాంక్షలకు అనుగుణంగా కొత్త అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాలు ఏర్పాటయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఏదేమైనా పునర్ వ్యవస్థీకరణ తేనెతుట్టెను లాఘవంగా కదిలించి, 50శాతం సీట్ల పెంపుతో మోడీ ప్రభుత్వం మరోమారు దేశ రాజకీయ చరిత్రలో తన మార్కు పాలనను, సంస్కరణల పర్వాన్ని చాటిచెప్పింది. అన్ని కుదిరి నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ కొత్తం చట్టం అమల్లోకి వస్తే, మాత్రం 2029 సార్వత్రిక ఎన్నికల్లో ఇండియన్ పొలిటికల్ సినారియో పూర్తిగా మారిపోతుందనడంలో ఏమాత్రం సందేహం లేదు....!

## ఏప్రిల్ 1న జిల్లాకొస్తున్న

# ముఖ్యమంత్రి చంద్రబాబు

- విింజమూరులో పర్యటించనున్న సి.యం.



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఏప్రిల్ 1వతేదీ బుధవారం జిల్లాకు రానున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలోని వింజమూరులో సీఎం పర్యటించనున్నారు. చెరువుకట్ట సుందరీకరణలో భాగంగా అభివృద్ధిచేసిన ట్యాంక్ బండ్‌తో పాటు అన్న క్యాంటీన్‌ని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. ఒకటవ తేదీ కావడంతో అదేరోజు పెన్షన్లని కూడా ఆయన అందజేసే అవకాశాలు ఉన్నాయి. అనంతరం వింజమూరులో జరిగే బహిరంగ సభలో కూడా సీఎం పాల్గొంటారు.

### పర్యటన సందిగ్ధం...!

బుధవారం మార్కాపురం వద్ద జరిగిన ప్రయివేట్ బస్సు దహనం ప్రమాదంలో ఎక్కువ శాతం బాధితులు ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన వారే ఉన్నారు. ఈ తరుణంలో ముఖ్యమంత్రి వచ్చి బాధితుల కుటుంబాలని కూడా పరామర్శిస్తారా.. లేక పర్యటన వాయిదా వేసుకుంటారా..? అన్న సందిగ్ధం కూడా స్థానిక నాయకుల్లో వ్యక్తమవుతోంది. ఒకవేళ ఆయన పర్యటన 3వ తేదీకి వాయిదాపడితే వింజమూరులోని చెన్నకేశవస్వామి ఆలయాన్ని కూడా బాబు సందర్శిస్తారని స్థానికులు చెప్తున్నారు. అధికార వర్గాలు మాత్రం సారు 1వ తారీఖునే వస్తారని ఘంటాపథంగా చెప్తున్నాయి.

# కేంద్ర హోంమంత్రిని కలసిన.. వేమిరెడ్డి దంపతులు

నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి..కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఈనెల 25న ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షాని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా, పెన్నానది కరకట్టల బలోపేతానికి చర్యలు చేపట్టాలని, పల్లిపాడులోని పినాకిని సత్యాగ్రహ ఆశ్రమం పరిరక్షణకు కృషిచేయాలని ఆయనకు విన్నవించారు. దక్షిణ భారత సబర్మతిగా పేరుగాంచిన ఇందుకూరుపేట మండలంలోని పినాకిని సత్యాగ్రహ ఆశ్రమం చరిత్రాత్మకమైనదని, ఈ ఆశ్రమం వద్ద సుమారు ఏడున్నర ఎకరాల మేర పెన్నానది కోతకు గురి కావడంతో గాంధీ ఆశ్రమం ఉనికికే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని వారు తెలిపారు. ఆశ్రమం నుంచి పల్లిపాడు వరకు పెన్నానదికి కుడివైపున 167 కోట్ల రూపాయల వ్యయంతో భారీ రక్షణగోడ నిర్మాణం, విడవలూరు మండలంలోని ముదివర్తి నుంచి ఊటుకూరు వరకు 95 కోట్లతో ఎడమ కరకట్ట ఆధునీకరణ, ఇందుకూరుపేట మండలంలో పొర్లుకట్టలను పటిష్టం చేయడానికి 69 కోట్లతో ప్రతిపాదనలను వారు ఆయనకి అందజేశారు. అందుకు అమిత్‌షా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.



కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో మాట్లాడుతున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి - ప్రశాంతిరెడ్డి దంపతులు

అదేవిధంగా, ఢిల్లీలోని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ని కూడా కలిసిన వేమిరెడ్డి దంపతులు, ఆయనను శాలువాతో సత్కరించి, శ్రీవారి ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రితో వారు వివిధ అంశాలపై చర్చించారు.

# ఉద్యోగులకి ధీమా.. ఎస్‌బీఐ బీమా!

## విద్యుత్ లైన్‌మెన్ విజయ్ కుటుంబానికి కోటి రూపాయల చెక్కు

ప్రభుత్వ విభాగాలలో పనిచేస్తూ తమ బ్యాంకులో శాలరీ(జీతం) ఖాతా ఉన్నవారికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వివిధ క్యాటగిరీలలో బీమాని వర్తింపజేస్తుంది. తమ దగ్గర ఖాతా ఉన్న వ్యక్తి ప్రమాదవశాత్తు మరణిస్తే వారి జీతం ఆధారంగా నలభై లక్షల నుండి కోటి రూపాయల వరకు బీమా రూపంలో చెల్లిస్తారు. ఇందులో భాగంగా ఆత్మకూరు విద్యుత్ శాఖలో పనిచేస్తూ ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన ఓ లైన్‌మెన్ కుటుంబానికి ఎస్.బి.ఐ అధికారులు మార్చి 25వతేదీ బుధవారం కోటి రూపాయల చెక్కును అందించారు.

వివరాలలోకి వెళ్తే... నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలం సంజీవ్‌నగర్ గ్రామానికి చెందిన పాణ్యం విజయ్ అనే వ్యక్తి ఆత్మకూరు విద్యుత్‌శాఖలో లైన్‌మెన్‌గా విధులు విర్వహించేవాడు. ఆయనకి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆత్మకూరు బ్రాంచ్‌లో శాలరీ ఖాతా వుంది. ప్రభుత్వం నుండి వచ్చే జీతం నేరుగా బ్యాంకు ఖాతా పడేవిధంగా ఖాతా తెరిచారు. అయితే, మూడు నెలల క్రితం విజయ్ విద్యుత్ స్తంభంపైన విధులు నిర్వహిస్తుండగా షాక్‌కు గురై తీవ్ర గాయాలతో చనిపోయాడు. బ్యాంకు నిబంధనల ప్రకారం విజయ్ కుటుంబానికి కోటి రూపాయలు మంజూరయ్యింది. ఈ మేరకు బుధవారం ఆత్మకూరులోని విద్యుత్ శాఖ కార్యాలయంలో ఎస్‌బిఐ నెల్లూరు రీజినల్ మేనేజర్ సత్యనారాయణ స్వామి, విద్యుత్ శాఖ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాను నాయక్ ఆధ్వర్యంలో మరణించిన విజయ్ భార్య అరుణకి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కోటి రూపాయల చెక్కును బ్యాంకు అధికారులు అందించారు. విజయ్ కుటుంబానికి అండగా నిలిచి తమ బ్యాంకు నిబంధనల ప్రకారం అయన భార్యకి కోటి రూపాయలు అందించడం పట్ల స్థానికులు హర్షం ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగ కుటుంబాలకి ధీమా కల్పిస్తూ బీమాని అందిస్తున్న ఎస్.బి.ఐ యాజమాన్యాన్ని అభినందిస్తున్నారు.




విద్యుత్ లైన్‌మెన్ కుటుంబానికి కోటిరూపాయల బీమా చెక్కును అందజేస్తున్న ఎస్.బి.ఐ అధికారులు

# శ్రీధర్‌రెడ్డికి అస్వస్థత!



నెల్లూరు రూరల్ శాసనసభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మరోసారి అస్వస్థతకు గురయ్యారు. న్యూరో సంబంధిత సమస్యతో గతంలో అయన నెలరోజుల పాటు కేరళలో ప్రకృతి చికిత్స చేయించుకుని వచ్చిన విషయం తెలిసిందే. అయితే, ఇటీవల తన నియోజకవర్గంలో జరిగిన పలు అభివృద్ధి పనులలో అయన చురుకుగా పాల్గొన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టించడంలో శ్రీధర్‌రెడ్డి అగ్రగణ్యుడని అందరూ ఆయనని పొగడ్తలతో ముంచెత్తారు. ఈ క్రమంలో ఆయనకి దిష్టి తగిలినట్లుంది. తాజాగా మరోసారి అదే న్యూరో సమస్యతో అనారోగ్యానికి గురై తమిళనాడు రాయవేలూరులోని సి.యం.సి (క్రిష్టియన్ మెడికల్ కాలేజీ)లో చికిత్స పొందుతున్నారు. ఓ వారం రోజుల పాటు తమ పర్యవేక్షణలో ఉండాల్సిందిగా వైద్యులు సూచించినట్లు తెలిసింది. తమ నాయకుడు త్వరగా కోలుకుని, సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని అయన అభిమానులు, అనుయాయులు పూజలు చేస్తున్నారు.



లాయర్
మార్చి 27, 2026

# అగ్నిప్రమాదాల పట్ల.. అప్రమత్తతే శ్రీరామరక్ష!

ఎండాకాలం వచ్చిందంటే చాలు.. ఒకపక్క మండు టెండలు, మరోవైపు అగ్నిప్రమాదాలు ఎంతో ఆందోళన కలిగిస్తుంటాయి. అందులోనూ ఈ మార్చి నెలలోనే ఎండలు దంచికొడుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఇప్పుడే 36 నుంచి 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. ఇక ఏప్రిల్, మే నెలల్లో ఎండలు ఇంకెంత భగ్గుమంటాయో చెప్పలేం. అందుకే ఈ ఎండాకాలంలో ఇబ్బందులు పడకుండా ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి. వేసవిలో అగ్నిప్రమాదాలు సహజంగానే తరచూ జరుగుతుంటాయి కనుక, ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా అగ్ని నుంచి ముప్పు తప్పదని గుర్తుంచుకోవాలి. అసలే ఎండా కాలంలో అగ్నిప్రమాదాలు ఎక్కువ. మనదేశంలో ఏటా సుమారు లక్షా 60వేలకి పైగానే అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయని, దాంతో కనీసం 27వేల మంది వరకు ప్రాణాలు కోల్పోతున్నారని నిపుణుల నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ ప్రమాదాల్లో అస్తినష్టాలతో పాటు, ప్రాణ నష్టాలు కూడా భారీగా సంభవిస్తూనే ఉన్నాయి. జాతీయ నేరగణాంకాల వివరాల ప్రకారం..మనదేశంలో రోజుకు సగటున 60 మంది వరకు అగ్నిప్రమాదాలకు బలైపోతూనే ఉన్నారు. ఏటా సుమారు పాతికవేల మందికిపైగానే ప్రాణాలు కోల్పోతున్నారు. 2001-2014 సంవత్సరాల మధ్యకాలంలో మనదేశంలో 3.16 లక్షల అగ్నిప్రమాద కేసులు నమోదయ్యాయని, 3 లక్షల మంది వరకు మరణించారని గణాంకాలు చెప్తున్నాయి. అంతేకాదు, ఏటా జరిగే అగ్నిప్రమాదాలతో దాదాపు వెయ్యికోట్లకు పైగానే ఆస్తినష్టం జరుగుతోందని కూడా నిపుణులు లెక్కలు కట్టారు.

అగ్ని ప్రమాదాలు అనేక కారణాల వల్ల జరుగుతూనే ఉన్నా... ఎక్కువగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లనే ఈ ప్రమాదాలు సంభవిస్తున్నాయని అగ్నిమాపకశాఖ నివేదికలు హెచ్చరిస్తున్నాయి. అందువల్ల విద్యుత్‌కి సంబంధించి నాణ్యమైన పరికరాలు వాడడం ముఖ్యం. ఇంటినుంచి బయటకు వెళ్ళిపోతున్నప్పుడు మరచిపోకుండా విద్యుత్ సరఫరాను ఆపేసుకోవడం మంచిది. కాల్చిపారేసిన బీడీ, లేదా సిగరెట్ల వంటివి కూడా ఒక్కోసారి పెద్ద ప్రమాదాలనే తెస్తాయి. చెత్తా చెదారాన్ని కాల్చివేసేటప్పుడు, అటవీప్రాంతాల్లో వెళ్తున్నప్పుడు వాటినుంచి మరింత జాగ్రత్తగా ఉండాలి. ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా, గాలికి నిప్పురవ్వలు ఎగిరిపడి అడవులే తగులబడిపోయే ప్రమాదం ఎంతైనా ఉంటుంది.

మరో పెద్ద సమస్య ఏమిటంటే, మనదేశంలో నేటికీ అనేక ప్రాంతాల్లో ఉన్న అగ్నిమాపక కేంద్రాల్లో తగినంతమంది సిబ్బంది లేకపోవడం, అగ్నిమాపక కేంద్రాలు కూడా అన్ని ప్రాంతాల్లో అందుబాటులో లేకపోవడం ఒక పెద్ద లోపం. అగ్నిమాపక వాహనాలు సక్రమంగా లేకపోవడం, సిబ్బందికి అవసరమైన పరికరాలు కానీ, తగు శిక్షణ కానీ ఆశించిన స్థాయిలో ఉండకపోవడం మరో సమస్య. ఆ కేంద్రాల వారు ఎప్పటివో పాతబడిన డొక్కు సామగ్రితోనే కాలం నెట్టుకొస్తున్నారు. దేశం ఎంత అభివృద్ధి చెందుతోన్నా.. ప్రజల ప్రాణాలు కాపాడేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉండే అగ్నిమాపక యంత్రాలు, పరికరాలను ఎప్పటికప్పుడు అధునాతనంగా ఉంచుకోలేని దుస్థితిని అధిగమించలేకపోతున్నాం. ఎక్కడైనా అగ్నిప్రమాదం జరిగితే ఆ వాహనాలు వచ్చేలోగా ఉన్న ఆస్తిపాస్తులన్నీ పూర్తిగా దగ్ధమైపోతుండడం చూస్తూనే ఉంటాం. ఇకనైనా ప్రభుత్వాలు వెంటనే దృష్టిపెట్టి అగ్నిమాపక కేంద్రాల్లోని సమస్యలు తీర్చి, వాటిని మరింతగా పటిష్టం చేయాల్సి ఉంది.

మరోవైపు ప్రజలు కూడా శ్రద్ధ తీసుకుని ఈ ప్రమాదాల బారిన పడకుండా ఎవరికి వారు తగు భద్రతా ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంది. ముఖ్యంగా పాఠశాలల్లో జనరేటర్ల వద్ద, వంట గదుల వద్ద..ఇళ్ళలోను, అపార్ట్‌మెంట్‌లలోను, పెద్దపెద్ద మాల్స్, భవనసముదాయాలలోనూ, పెట్రోలు బంకులు, జన సమూహాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోను, పరిశ్రమలు, కార్యాలయాలు, టపాసుల తయారీకేంద్రాలు, గోడౌన్లు ఒకటేమిటి.. ఇలా అన్ని చోట్ల అగ్నిప్రమాదాల నుంచి కాపాడుకునేందుకు భద్రతా పరికరాలు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి. స్కూళ్లు, ఆసుపత్రులను సురక్షితంగా ఉంచుకోవాలి. ఫైర్ అలారం, ఫైర్‌స్మోక్ డిటెక్టర్లను అవసరమైన ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకోవాలి. ఎయిర్‌కండిషనర్లు, ఫ్రిజ్‌ల వంటివాటి పనితీరు సరిగా ఉందో లేదో తరచూ చూసుకుంటూ ఉండాలి. వాహనాల్లో వెళ్ళేటప్పుడు, దూరప్రాంత ప్రయాణాలు చేసేటప్పుడు ఎక్కడా అగ్ని ప్రమాదాలకి తావులేకుండా ఎప్పటికప్పుడు తగు భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలి. జరగకూడనిది జరిగిన తర్వాత బాధపడేకంటే, నిర్లక్ష్యం వహించకుండా, ముందు జాగ్రత్తతో అగ్నిప్రమాదాలు జరగకుండా చూసుకోవడమే ఉత్తమం.. అన్ని విధాలా శ్రేయస్కరం కూడా!...

# నేరాలు - ఘోరాలతో తస్మాత్ జాగ్రత్త!




గత వారం మన 'లాయర్'లో 'కూటమి నేతల నేరాలు - ఘోరాలు' అనే హెడ్డింగుతో మొదటిపేజీ వార్త ప్రచురించారు. 'లాయర్' అభిప్రాయంతో నేను విభేదిస్తున్నాను. మొత్తం ఆంధ్ర రాజకీయాలే నేరాలు-ఘోరాలతో వర్ధిల్లుతున్నాయి. కేవలం కూటమి నేతలనే తప్పు పట్టడం సబబు కాదు. అసలు మన రాష్ట్ర రాజకీయాలలో దోపిడీలకు, దౌర్జన్యాలకు, దుర్మార్గాలకు బీజం పడిందే.. 2019 నుండి. వై.యస్.రాజారెడ్డి వారసుడు అధికారంలోకి వచ్చిన తరువాతే సహజ వనరుల దోపిడీలు, ప్రభుత్వ, ప్రైవేట్ నిర్మాణాల కూల్చివేతలు, అక్రమ కేసులు, బూతు పురాణాలు, కక్షపూరిత దాడులు పెరిగిపోయాయి. కూటమి నేతలు అమాయకులు అని నేను అనడంలేదు. 2019 తరువాత మొత్తం రాష్ట్ర రాజకీయ వ్యవస్థే భ్రష్టు పట్టిపోయిందని నా అభిప్రాయం. ఆకురౌడీలు సైతం మంత్రులుగా అవతరించి రాష్ట్రాన్ని ఏలారు. తమ ఇష్టానుసారం దొరికిన మేరకు దోచుకున్నారు. చాలామంది శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు, పార్లమెంటు సభ్యులు కూడా రాష్ట్రం తమ సొంత జాగీరు అన్నట్లుగా ప్రవర్తించారు. రాష్ట్రంలో 'రక్త చరిత్రకి' ఆజ్యం పోసిందే వైసీపీ అన్నది ముమ్మాటికీ నిజం. "నీవు నేర్పిన విద్యే నీరజాక్ష" అన్నట్లుగా కూటమిలోని కొందరు అదే మార్గాన్ని అనుసరిస్తున్నారు. వైసీపీ అలా చేసింది కాబట్టే ఆంధ్ర ఓటర్లు ఆ పార్టీని 11సీట్లకి పరిమితం చేశారు. ఆ నిజాన్ని గ్రహించి కూటమి నేతలు మేల్కొంటే మంచిది. లేదంటే మళ్ళీ సీన్ రివర్స్ అవుతుంది. ఆ తరువాత అందరూ 'రక్త చరిత్ర' రెండవ భాగం చూడవలసి వస్తుంది. తస్మాత్ జాగ్రత్త...!

యం. చంద్రమౌళి, కొత్తఢిల్లీ.

# ప్రవచనకర్తలు వివాదాస్పద వ్యాఖ్యలు చేయకూడదు!

తమ ఉపన్యాసాలతో సమాజాన్ని ప్రభావితం చేయడం ప్రవచనకర్తల బాధ్యత. జనంలో ఆధ్యాత్మిక తత్పరత పెరిగేలా వారిని చైతన్యవంతుల్ని చేయడం వారి కనీస కర్తవ్యం. అయితే, రెండు తెలుగు రాష్ట్రాలలో కొంతమంది ప్రముఖ ప్రవచనకర్తలు వివాదాస్పద వ్యాఖ్యలు చేసి రచ్చకెక్కుతున్నారు. రాజకీయ నాయకులకి, ప్రభుత్వాలకి వత్తాసు పలుకుతూ, లేదా విమర్శిస్తూ అనవసరమైన వివాదాలకు ఆజ్యం పోస్తున్నారు. తాజాగా ప్రభుత్వ పాఠశాలలో, హాస్టళ్లలో మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థినివిద్యార్థులకి భోజనం పెట్టి కోడిగుడ్డు ఇవ్వడాన్ని చులకన చేస్తూ పద్మశ్రీ గరికపాటి నరసింహారావు తన సహజమైన వ్యంగ్య ధోరణిలో ప్రభుత్వాలని విమర్శించారు. ఆయన చేసిన వ్యాఖ్యలపైన నెటిజన్లు ఆయనపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నిజమే ఆయన అలా మాట్లాడి వుండాల్సింది కాదు. "గుడ్డెందుకండి గాడిద గుడ్డు" అని అనడమే కాకుండా "అసలు మధ్యాహ్న భోజన పథకమే అనవసరం" అన్నట్లుగా గరికపాటి మాట్లాడారు. గతంలో చాగంటి కోటేశ్వరరావు కూడా కొన్ని రాజకీయ వ్యాఖ్యలు చేసి చిక్కులు కొనితెచ్చుకున్నారు. ప్రవచనాలు చెప్పే వారెవరైనా ప్రభుత్వాలు, రాజకీయాలు వంటి అంశాలకి దూరంగా ఉంటే శ్రేయస్కరం!

– వై. రఘునాథశర్మ, ఒంగోలు.

# అక్రమ మతమార్పిడులకు అడ్డుకట్ట

మనసులో మాట 90

భారత రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు సామాజిక వివక్షను ఎదుర్కొంటున్న వర్గాలకు ఇచ్చే రక్షణ కవచాలు. అయితే, ఈ కవచాన్ని అడ్డుపెట్టుకుని కొందరు సాగిస్తున్న 'ద్వంద్వ ప్రయోజనాల' వేటపై సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు ఒక చారిత్రాత్మక మలుపు. ఈ తీర్పు అర్హులకు రాజ్యాంగ ఫలాలు అందకుండా చేస్తున్న వారికి చెంపపెట్టు. అంతేకాదు... అక్రమ మత మార్పిడులకు అడ్డుకట్ట వేయగలదు. భారత రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల ఫలాలు నిజమైన అర్హులకు అందాలనేది రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆశయం.

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పాస్టర్ చింతాడ ఆనంద్‌పాల్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈ తీర్పు వెలువరించింది. ఆనంద్‌పాల్ ఒక క్రైస్తవుడు. మతంలోకి మారకముందు దళితుడు. గత పదేళ్లుగా ఆయన బహిరంగంగా క్రైస్తవ మతాన్ని ప్రకటిస్తూ, ఒక పాస్టర్‌గా సేవలు అందిస్తున్నారు. తనపై జరిగిన కొన్ని దాడులకు సంబంధించి ఆయన ఎస్సీ, ఎస్టీ (నిరోధక) చట్టం కింద రక్షణ కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆ ఫిర్యాదును కొట్టివేసింది. క్రైస్తవంలో కుల వ్యవస్థ లేదని, ఒక వ్యక్తి పాస్టర్‌గా పనిచేస్తూ క్రైస్తవ మతాన్ని అనుసరిస్తున్నప్పుడు ఆయన చట్టప్రకారం ఎస్సీ హోదాను కోరలేరని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పును సవాలు చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించగా, జస్టిస్ పి.కె. మిశ్రా మరియు జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం హైకోర్టు నిర్ణయాన్ని సమర్థిస్తూ తుది తీర్పు వెలువరించింది. ఈ తీర్పులో అత్యంత కీలకమైన అంశం 1950 నాటి రాజ్యాంగ (షెడ్యూల్డ్ కులాలు) ఉత్తర్వులోని క్లాజ్ 3. దీని ప్రకారం హిందూ, సిక్కు లేదా బౌద్ధ మతాలకు చెందని ఏ వ్యక్తి కూడా షెడ్యూల్డ్ కుల సభ్యుడిగా పరిగణించబడరు. ఈ నిబంధన చాలా స్పష్టంగా, కచ్చితంగా ఉందని, ఒక వ్యక్తి క్రైస్తవం లేదా ఇస్లాం వంటి మతాల్లోకి మారిన క్షణం నుండే అతని పుట్టుకతో సంబంధం లేకుండా ఎస్సీ హోదా "తక్షణమే మరియు పూర్తిగా" రద్దవుతుందని కోర్టు తేల్చిచెప్పింది. క్రైస్తవ మత సిద్ధాంతాల ప్రకారం అక్కడ కుల వ్యవస్థకు గుర్తింపు లేదని, కాబట్టి ఒకవైపు క్రైస్తవుడిగా ఉంటూ మరోవైపు ఎస్సీ హోదాను కోరడం రాజ్యాంగ విరుద్ధమని కోర్టు అభిప్రాయపడింది. ఇవి రెండు పరస్పర విరుద్ధమైన స్థితులని, ఒకే సమయంలో రెండింటినీ అనుభవించడం అసాధ్యమని ధర్మాసనం పేర్కొంది. సంక్షేమ పథకాల్లో సాగుతున్న ద్వంద్వ ప్రయోజనాలకు ఈ తీర్పు ఒక 'గొడ్డలిపెట్టు' లాంటిది. ఉదాహరణకు, చాలామంది వ్యక్తులు మతం మారిన తర్వాత 'మైనారిటీ' హోదాలో విద్యాసంస్థల్లో రాయితీలు లేదా విదేశీ విద్యకు స్కాలర్‌షిప్‌లు పొందుతూ, అదే సమయంలో తమ పాత ఎస్సీ సర్టిఫికేట్‌తో ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు వాడుకుంటున్నారు. ఇది ఒకే వ్యక్తి రెండు వేర్వేరు సామాజికవర్గాలకు కేటాయించిన ఫలాలను దోచుకోవడమే అవుతుంది. అలాగే రాజకీయ రంగంలో కూడా క్రైస్తవ మతాన్ని పాటిస్తూ, చర్చి కార్యక్రమాల్లో చురుగ్గా ఉంటూ కూడా, ఎన్నికల సమయంలో మాత్రం ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాల నుండి పోటీ చేస్తున్నారు. ఇది ఆ నియోజకవర్గంలోని నిజమైన హిందూ ఎస్సీల ప్రాతినిధ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా రాజ్యాంగాన్ని వంచించడం కూడా అవుతుంది. ఇటువంటి ద్వంద్వ నీతిని పాటించే ప్రతి ఒక్కరికీ ఈ తీర్పు ఒక కనువిప్పు కావాలి. కొంతమంది విద్యార్థులు విదేశీ విద్య కోసం మైనారిటీ కోటా కింద రాష్ట్ర లేదా కేంద్ర ప్రభుత్వాల నుండి భారీ స్కాలర్‌షిప్‌లు పొందుతూ, స్వదేశానికి తిరిగి వచ్చిన తర్వాత అదే ఎస్సీ సర్టిఫికేట్‌తో ప్రభుత్వ ఉద్యోగాల కోసం రిజర్వేషన్లు కోరుతున్నారు. ఇది నిజమైన అర్హులైన ఎస్సీ అభ్యర్థుల అవకాశాలను హరించడమే. గృహ నిర్మాణ పథకాలు లేదా సంక్షేమ పెన్షన్ల విషయంలోనూ ద్వంద్వ ప్రయోజనాలు పొందుతున్న ఉదంతాలున్నాయి. ఒకే కుటుంబంలో ఒకరు మైనారిటీ గుర్తింపు కార్డుతో ఒక పథకాన్ని, కుల ధృవీకరణ పత్రంతో మరో పథకాన్ని అక్రమంగా పొందుతున్నారు. ఇటువంటి అక్రమాలకు ఈ తీర్పు చెక్ పెడుతుంది.

అంతేకాకుండా, ఈ తీర్పు భారతదేశంలో సాగుతున్న అక్రమ మతమార్పిడులకు బలమైన అడ్డుకట్ట వేస్తుంది. క్షేత్రస్థాయిలో పాస్టర్లు లేదా మిషనరీ సంస్థలు ఆర్థిక ప్రలోభాలు చూపి మతం మార్చే క్రమంలో, "మీ రిజర్వేషన్లకు ఏమీ కాదు, మీరు ఎస్సీలుగానే కొనసాగవచ్చు" అని ఇచ్చే అభయం ఇకపై చెల్లదు. మతం మారితే రాజ్యాంగబద్ధమైన హక్కులు పోతాయనే నిజాన్ని ఈ తీర్పు చాటి చెప్పింది. ఆధ్యాత్మిక కారణాలతో మతం మారేవారు తమ సామాజిక హోదాను వదులుకోవడానికి సిద్ధపడాలి, అప్పుడే ఆ మతమార్పిడిలో చిత్తశుద్ధి ఉంటుంది. ఒకవేళ ఎవరైనా తిరిగి హిందూ, బౌద్ధ లేదా సిక్కు మతంలోకి వస్తే, వారు తమ పాత కులానికి చెందినవారని నిరూపించుకోవాల్సిన బాధ్యత వారిపైనే ఉంటుందని, దానికి సరైన ఆధారాలు ఉండాలని కూడా కోర్టు స్పష్టం చేసింది. కేవలం స్వయం ప్రకటన సరిపోదని, ఆ కుల సభ్యులు వారిని అంగీకరించినట్లు స్పష్టమైన, నమ్మదగిన ఆధారాలు ఉండాలని కోర్టు తేల్చింది. మొత్తానికి, సంక్షేమ ఫలాలు అత్యంత అట్టడుగున ఉన్న నిజమైన లబ్ధిదారులకు చేరాలని, వ్యవస్థను వంచిస్తున్న వారికి ఈ తీర్పు ఒక హెచ్చరిక అని చెప్పవచ్చు. మతం మార్పిడి అనేది ఒక వ్యక్తిగత విశ్వాసానికి సంబంధించినది కావాలి తప్ప, రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను అక్రమంగా దోచుకోవడానికి ఒక సాధనంగా మారకూడదు. పారదర్శకమైన సామాజిక వ్యవస్థ నిర్మాణం దిశగా ఇది ఒక చారిత్రాత్మక ముందడుగు. ఈ తీర్పు అమలుతో భవిష్యత్తులో కుల ధృవీకరణ పత్రాల జారీ మరియు తనిఖీ ప్రక్రియలో కఠినమైన మార్పులు వచ్చే అవకాశం ఉంది, ఇది నిజమైన లబ్ధిదారులకు మేలు చేస్తుంది.



- తుమ్మల బాల గంగాధర్ తిలక్

# మత్స్యకారుల సమస్యలు తీరుస్తాం!

## • మంత్రి కొల్లు రవీంద్ర హామీ



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర, పక్కన మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, ఫరూక్ తదితరులు

మత్స్యకారుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకున్నా, ఎల్లప్పుడూ మత్స్యకారుల పక్షంగానే ఉంటుందని, ప్రభుత్వం పూర్తిగా వారికి అండగా నిలుస్తుందని రాష్ట్ర ఎక్సైజ్ – గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. ఈనెల 24వ తేదీన నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సముద్రంలో చేపలవేటకు అక్రమబోట్ల ప్రవేశం పూర్తిగా నివారించే అంశంపై జువ్వలదిన్నె మత్స్యకారుల సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిన కమిటీ సభ్యులతో ఈ సమావేశం జరిగింది. మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ, కాకినాడ ఎమ్మెల్యే కొండబాబు, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పాల్గొనగా, కలెక్టర్ హిమాన్షు శుక్ల అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. మంత్రులు కొల్లు రవీంద్ర, ఎన్ఎండి ఫరూక్, ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, బల్లి కల్యాణ్‌చక్రవర్తి, రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, దగుమాటి వెంకట కృష్ణా రెడ్డి, నెలవల విజయశ్రీ, పాశం సునీల్‌కుమార్, ఐజి సర్వశ్రేష్ట త్రిపాఠి, జిల్లా ఎస్పీ డా.అజితా వెజండ్ల, మత్స్యశాఖ కమిషనర్ రామ్‌శంకర్‌నాయక్ హాజ రయ్యారు. మన తీరంలో చేపలవేటకు అక్రమంగా తమిళనాడు, పాండిచ్చేరి బోట్ల ప్రవేశాన్ని పూర్తిగా అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలు, మత్స్యకారుల భద్రత, భరోసా మొదలైన అంశాలపై కమిటీ సభ్యులు ప్రజాప్రతి నిధులతో చర్చించారు.

### సముద్రంలో గస్తీని ముమ్మరం చేశాం

మంత్రి కొల్లు రవీంద్ర విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో 8 నెలలుగా మత్స్యకారుల ఆధీనంలో వున్న పాండిచ్చేరికి చెందిన నాలుగు బోట్లను గుర్తుతెలియని వ్యక్తులు తీసుకెళ్లారని, దీంతో తీర ప్రాంతాల్లోని మత్స్యకార గ్రామాల్లో మత్స్య కారులు ఆందోళనతో ఉన్నట్లు చెప్పారు. గత 20 సంవత్సరాలుగా తమిళనాడు, పాండిచ్చేరి, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల మధ్య ఈ బోట్ల సమస్య వుందని చెప్పారు. కొంతమంది కావాలనే సమస్యలు సృష్టిస్తు న్నారని ఆయన అంటూ, వాటన్నిటినీ శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటికే తమిళనాడు బోట్ల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. ఇందులో భాగంగా టాస్క్ ఫోర్స్ బృందంతో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ తీరంలో మెకనైజ్డ్ బోటుతో గస్తీని ముమ్మరం చేసినట్లు చెప్పారు. నూతన బోట్లు ఏర్పాటు చేయడం, మెరైన్, కోస్టల్ గార్డ్ వ్యవస్థను పటిష్టం చేయడం మొదలైన అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.



# డా. రేవూరుకు..'కళారత్న'

మన నెల్లూరీయులు..దగదర్తి మండలం చెన్నూరు గ్రామ వాసి, ప్రస్తుతం హైదరాబాదు నివాసి, దూర దర్శన్ విశ్రాంత అదనపు డైరెక్టర్ జనరల్ డా. రేవూరు అనంతపద్మనాభరావుకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 'కళారత్న' హంస అవార్డునిచ్చి సత్కరిం చింది. ఉగాది పర్వదినం నాడు ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నుంచి ఆ పురస్కారాన్ని అందుకున్నారు. డా. రేవూరు వారు శతాధిక గ్రంథకర్త, తెలుగు–ఆంగ్ల భాషల్లో సుమారు నూటపాతికకి పైగానే గ్రంథాలు రాసి ఎన్నో సన్మా నాలను, అవార్డులను అందుకున్నారు. ఇటీవల భోపాల్ అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్‌లో ఆయన 'భారత భాషా భూషణ్' అవార్డును కూడా అందుకున్న విషయం తెలిసిందే!

# వరికంకులతో.. బీజేపీ నాయకుల ధర్నా





ధాన్యాన్ని కుప్పగా పోసి ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

జిల్లాలోని ధాన్యం రైతు లకు మద్దతు ధర ఇప్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23న బీజేపీ నాయకులు మిడతల రమేష్, కందికట్ల రాజేశ్వరి తదితరులు నెల్లూరులో వరి కంకులు చేతపట్టి, ధాన్యాన్ని రోడ్డుపై పోసి ధర్నా చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద మిల్లర్లు చేరి, తేమ సాకుతో రైతుల నుంచి ఎక్కువ ధాన్యాన్ని తీసేసుకుంటున్నారని వారు చెప్పారు. పుట్టికి (850 కేజులు) 960 కేజీల వంతున మిల్లర్లు తీసుకుంటున్నా, రైతులు అన్యాయానికి గురవు తున్నా అడిగే నాథులు లేరన్నారు. మద్దతు ధర కంటే కనీసం వెయ్యి రూపాయలు తక్కువగా అమ్ముకుంటూ రైతులు నష్టాల పాలవుతున్నారని, జిల్లా ఉన్నతాధికారులు ఇకనైనా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను రైతులకు ఇప్పించి, మిల్లర్ల దోపిడీల నుంచి కాపాడాలని వారు కోరారు. సుబ్బారెడ్డి, రమేష్‌రెడ్డి, ఆదినారాయణ, విజయశ్రీ, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

# 29న వేద విజ్ఞాన వేదిక సభ

చెన్నై టీనగర్‌లోని వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహికలో భాగంగా 171వ ప్రసంగ కార్యక్రమం ఈనెల 29న సాయంత్రం 6.30 గంటలకు ఆంధ్రా క్లబ్‌లో ఏర్పాటుచేశామని వేదిక అధ్యక్ష కార్యదర్శులు జేకేరెడ్డి, కందనూరు మధు తెలిపారు. ప్రముఖ రచ యిత్రి కుమారి బులుసు నవీన 'సంస్కృతంలో చమ త్కారం' అనే అంశంపై ప్రసంగిస్తారని, సాహిత్యాభి మానులందరూ విచ్చేయాలని వారు విజ్ఞప్తిచేశారు.




## శ్రద్ధాంజలి

మితభాషి, మా కుటుంబ శ్రేయోభిలాషి
మంచి మనసున్న స్నేహాభిలాషి
**పోతిరెడ్డి రామిరెడ్డి** గారు
తేది. 21.03.2026 శనివారం నాడు
శైవసాన్నిధ్యం పొందారు.
వారి పవిత్ర ఆత్మకి సద్గతి చేకూరాలని
భగవంతుని ప్రార్థిస్తూ...

తోడల్లుడు
**కేసవరపు ఆదినారాయణరెడ్డి,** ఈతముక్కల
తోడల్లుడి కుమార్తె
**బుర్లా లక్ష్మి,** సింగపూర్
తోడల్లుడి కుమారుడు
**డాక్టర్ కేసవరపు సుబ్బారెడ్డి,** హైదరాబాదు
మరియు **కుటుంబసభ్యులు**

**ఉత్తరక్రియలు :** వారి పెద్దకర్మ తేది. 02.04.2026 గురువారం ఉదయం 10.00 గంటలకు నెల్లూరుజిల్లా, ముత్తుకూరు మండలం, పిడతాపోలూరులోని వారి స్వగృహము నందు జరుగును. కావున తెలియజేయడమైనది.

# కాపు భవన్‌కు..మరో కోటి విరాళం



జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకి విరాళం చెక్కుని అందజేస్తున్న మంత్రి అల్లుడు పునీత్

కాపులకిచ్చిన మాటను నిలబెట్టుకుంటూ రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ నెల్లూరులోని కాపు భవన్ ఆధునీకరణకు ఈనెల 24న కోటి రూపాయల విరాళం ఇచ్చారు. ఆమేరకు చెక్కును మంత్రి అల్లుడు పునీత్ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు అందచేశారు. కాపుభవన్ కోసం గతంలో ఇచ్చిన కోటి కాక, మరో కోటి రూపాయలను ఇప్పుడు విరాళంగా ఇచ్చిన మంత్రికి కాపు భవన్ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ, మంత్రి నారాయణ అందించిన ఈ నిధులతో వచ్చే జులై నాటికే కాపు భవన్ ఆధునీకరణ పనులన్నీ పూర్తిచేసి అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. కాపుభ్ భవన్ నాయకులు గాదిరాజు అశోక్, పోతరాజు శ్రీనివాస్, అనిల్‌కుమార్, గునుకుల కిషోర్, భూపతి విజయ కుమార్, పసుపర్తి కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల త్యాగాలను స్మరించుకున్న యువత



దేశ భక్తి నినాదాలు చేస్తున్న విద్యార్థినీ విద్యార్థులు

భారత స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల బలిదానాలను పురస్కరించుకుని సోమవారం నెల్లూరు నగరంలో 'మేరా యువ భారత్' ఆధ్వర్యంలో 'షహీద్ దివస్' పాదయాత్రను ఘనంగా నిర్వహించారు. నగరంలోని వీఆర్‌సి సెంటర్ నుండి గాంధీబొమ్మ సెంటర్ వరకు ఈ యాత్ర సాగింది. 'పరిశుభ్రతే సేవ' అనే నినాదంతో ప్రాంగణాన్ని శుభ్రం చేసిన అనంతరం పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన అధికారి ఆకుల మహేంద్రరెడ్డి మాట్లాడుతూ.. క్రమశిక్షణ, దేశభక్తి కలిగిన యువతతోనే నవ భారత్ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. సెక్రెటేల్ మేనేజర్ శ్రీనివాసులు, పలు కళాశాలల విద్యార్థులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# పర్వతరెడ్డి ప్రత్యేక ప్రార్థనలు



ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

రంజాన్ పండుగను పురస్కరించుకుని ఇటీవల ముస్లిం మైనార్టీ సోదరులతో కలిసి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్.. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నెల్లూరులోని సంతపేట ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మైనార్టీ సోదరులను కలుసుకొని రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు మజ్జిగ జయకృష్ణారెడ్డి, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.






# నెల్లూరు కబుర్లు

## వడగళ్ళ వానతో..
# నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

**మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**



ఇటీవల జిల్లాలోని పలు ప్రాంతాల్లో కురిసిన వడగళ్ళ వానతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. సోమవారం నెల్లూరు జిల్లా కలెక్టరేట్లో ఆయన అధికారులతో సమావేశమయ్యారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, ఇతర అధికారులతో కలిసి పంట నష్టాలపై సమీక్ష నిర్వహించారు. పంట నష్టాల వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. రెండు రోజుల్లో ఎన్యుమరేషన్ పూర్తి చేయాలన్నారు. అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యం కారణంగా జిల్లాలోని అనంతసాగరం, మర్రిపాడు, కలువాయి, రాపూరు, సీతారాంపురం మండలాల్లోని 21 గ్రామాల్లో 1469 మంది రైతులు సుమారు 1289 హెక్టార్లలో పంటలను నష్టపోయినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేసినట్లు తెలిపారు. , నిబంధనల మేరకు వారికి సకాలంలో నష్టపరిహారం అందిస్తామని, కౌలు రైతులను కూడా ఆదుకుంటామని స్పష్టం చేశారు.

# 'చిన్ని'కి..అరసం అభినందన



చిన్ని నారాయణరావుని సత్కరిస్తున్న అరసం సభ్యులు

నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి, ఆడిటర్ చిన్ని నారాయణరావు ఉగాది పర్వదినం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులమీదుగా 'కళారత్న-హంస అవార్డును అందుకున్న సందర్భంగా, నెల్లూరుజిల్లా అభ్యుదయ రచయితల సంఘం వారు చిన్ని నారాయణరావును ఆత్మీయంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అరసం గౌరవ అధ్యక్షులు పెరుగు రామకృష్ణ, అధ్యక్షులు డా.గంగిశెట్టి శివకుమార్, కార్యదర్శి అవ్వారు శ్రీధర్‌బాబు పాల్గొని సాహిత్యరంగంలో ఆయన చేస్తున్న కృషిని అభినందించారు.

## ఏప్రిల్ 6 వరకు.. సంతపేట
# శ్రీ ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు



నెల్లూరు సంతపేటలోని శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో ఈనెల 26వ తేదీ సాయంత్రం స్వామివారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిగింది. ఏప్రిల్ 6వ తేదీ వరకు అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి పోట్ల రఘురామయ్య తెలిపారు. ఈ నెల 27వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటలకు ధ్వజారోహణం, 11 గంటలకు తిరిచి ఆలయ ఉత్సవం, రాత్రి 8 గంటలకు కమలం ఉత్సవం నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా, 28వ తేదీ రాత్రి 8 గంటలకు సింహవాహనోత్సవం, 29న హంసవాహనం, 30న జింక వాహనం, గిన్నెభిక్ష, 31న గంధర్వ వాహనోత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీ సాయంత్రం 6గంటలకు శ్రీ సీతారామ కల్యాణం, 9గంటలకు గజ వాహనోత్సవం, 2వ తేదీన వైభవోపేతంగా రథోత్సవం, 3న అశ్వవాహనోత్సవం ఉంటాయని, 4వ తేదీ ఉదయం ధ్వజావరోహణం అనంతరం, వసంతోత్సవం, రాత్రి 8 గంటలకు యాళి వాహనం నిర్వహిస్తామన్నారు. 5వ తేదీ రాత్రి ఊంజల్‌సేవ, దవనోత్సవం నిర్వహిస్తామని, ఈ బ్రహ్మోత్సవాలకు భక్తులందరూ తరలివచ్చి స్వామివారి కృపాకటాక్షాలను పొందాలని ఆయన కోరారు.

## శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి..
# హుండీ ఆదాయం 23 లక్షలు

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయంలో ఈనెల 24న హుండీల లెక్కింపు జరిగింది. జనవరి 7 నుంచి మార్చి 24వ తేది వరకు 76 రోజులలో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా 22,20,619 రూపాయలు, అన్నదానం హుండీల ద్వారా 80,786 రూపాయలు వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్‌రెడ్డి, ధర్మకర్తల మండలి ఛైర్మెన్ ఏలూరు శిరీష ఒక ప్రకటనలో తెలిపారు.

## వాకర్స్ ఆధ్వర్యంలో..
# రంజాన్ పండుగ సన్మానాలు



ముస్లిమ్ వాకర్స్ సభ్యులని సన్మానిస్తున్న ఫ్రెండ్స్ వాకర్స్ కార్యవర్గం

రంజాన్ పండుగ సందర్భంగా నెల్లూరు ఏసీ స్టేడియంలోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్‌లోని ముస్లిమ్ సభ్యులను అసోసియేషన్ వారు ఆత్మీయంగా శాలువాలతో సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షులు షేక్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ రంజాన్ పండుగ మతసామరస్యానికి, దాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. కార్యదర్శి శానంపూడి సుబ్బారాయుడు, ట్రెజరర్ సితారి రత్నయ్య, గౌరవాధ్యక్షులు బిరదవోలు రామ్మోహన్‌రెడ్డి, 203-డిస్ట్రిక్ గవర్నర్ నలుబోలు బలరామయ్య నాయుడు, డిప్యూటీ గవర్నర్ జీవీ కృష్ణయ్య, వీరిశెట్టి హజరత్‌బాబు, యు.గోవర్ధన్, పత్తిపాటి రమణయ్య, మాగంటి ప్రసాద్‌నాయుడు, చెంచయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

**ఉగాది సంబరాలు :**

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ నసీర్ అహ్మద్ ఆధ్వర్యంలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పంచాంగాన్ని కవి పండితులు రాఘవాచార్యులు వినిపించారు. హాజరైన సభ్యులందరకు గువ్వల నారాయణరెడ్డి, ఉమామహేశ్వరిల సౌజన్యంతో ఉగాది పచ్చడి తదితర ప్రసాదాలు అందజేశారు. సంప్రదాయ దుస్తులతో వచ్చిన 70 మంది సభ్యులకు బహుమతులిచ్చారు.

# శబరి శ్రీరామక్షేత్రంలో.. ప్రత్యేక పూజలు

శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని నెల్లూరు దర్గామిట్టలోని శబరి శ్రీరామక్షేత్రంలో సీతారాములకు, ఆంజనేయస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 24 స్వామివార్లకు నందివర్ధన పూజ, గంధాభిషేకం నేత్రపర్వంగా జరిగాయి. ఆలయ ఛైర్మెన్ చెన్నూరు వెంకటేశ్వర్‌రెడ్డి, రామభక్త బృందం సభ్యులు ఈ వేడుకలను పర్యవేక్షిస్తున్నారు.

# 'గరికపాటి' వ్యాఖ్యలు.. అమానవీయం!

మధ్యాహ్న భోజన పథకం, పాఠ్యపుస్తకాల పంపిణీలపై ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు చేసిన వ్యాఖ్యలు అమానవీయమైనవని ఆలిండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్ఓ) రాష్ట్ర కార్యదర్శి మహేష్ ఒక ప్రకటనలో విమర్శించారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు వచ్చేది మధ్యాహ్న భోజనానికా, కోడిగుడ్లు కోసమా అని ప్రశ్నిస్తూ, వాటి పంపిణీ అవసరం లేదని వ్యంగ్యంగా విద్యార్థులను శోభనం పెళ్లి కొడుకుతో పోల్చడం అనుచితమని ఆయన విమర్శించారు. పేద విద్యార్థులు డ్రాప్ అవుట్స్ కాకుండా, విద్యను పొందడానికి అవసరమైన సౌకర్యాలు కల్పించడం, పౌష్టికాహారం అందించడం ప్రభుత్వాల బాధ్యతని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో పేదవాళ్లే ఎక్కువ అనీ, ఆకలితో పాఠశాలలకు వస్తున్న విద్యార్థులు చదువుపై పూర్తి దృష్టి సారించలేరని, అలాంటి పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం తప్పనిసరి అని ఆయన వివరించారు. గరికపాటి వారు వివక్ష పూరిత వ్యాఖ్యలు చేయడం రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న లక్షలాది విద్యార్థులను చులకన చేయడమే అవుతుందన్నారు. ఇకనైనా ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకుని వారికి క్షమాపణలు చెప్పాలన్నారు.

# వార్డెన్లకు అవగాహన

జిల్లాలోని ప్రభుత్వ హాస్టళ్ళ వార్డెన్లకు ఆహార భద్రత అధికారులు జి.వెంకటేశ్వర్‌రావు, ఎం.ప్రణతి, డాక్టర్ డి.నీరజ ఈనెల 24న నెల్లూరులోని డీఆర్డీఏ సమావేశమందిరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సరుకులు కొనుగోలు చేయడం నుంచి, భోజనం వండి వడ్డించేవరకు అన్ని దశల్లోనూ నాణ్యత ఎలా ఉండాలో వారికి చెప్పారు.

### పరిశ్రమల స్థాపనతో..

# యువతకు ఉద్యోగాలు

**మంత్రి నారాయణ**



మార్కెట్‌ను పరిశీలిస్తున్న మంత్రి పొంగూరు నారాయణ

రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, పరిశ్రమల స్థాపన ద్వారా ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువనేత నారా లోకేష్ నిరంతరం కృషి చేస్తున్నారని రాష్ట్ర పురపాలకమంత్రి డా.పొంగూరు నారాయణ చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరులోని సంతపేటలో పర్యటించి, మార్కెట్‌ను, పినాకిని పార్కులోని సచివాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. నెల్లూరు షుగర్‌ఫ్యాక్టరీ స్థలంలో కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయడం, అలాగే 10,060 పోస్టులతో కొత్త జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం ద్వారా స్థానిక యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి జరుగుతోందన్నారు. తొలుత, సంతపేట సచివాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. మేయర్ సుజాత, కమిషనర్ నందన్, స్థానిక ప్రజా ప్రతినిధులు, కార్పొరేషన్ అధికారులు ఉన్నారు.

### బారాషహీద్ దర్గాను అభివృద్ధి చేస్తాం..

మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి నారాయణ చెప్పారు. నెల్లూరు, బారాషహీద్ దర్గా వద్ద నిర్వహించిన రంజాన్ వేడుకల్లో పాల్గొన్న అనంతరం మంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో ఆగిపోయిన దర్గా అభివృద్ధి పనులను 9.8 కోట్ల రూపాయలతో పునఃప్రారంభిస్తామన్నారు. మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తు కోసం వక్ఫ్ బోర్డు స్థలంలో 20 కోట్ల రూపాయలతో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన స్కూల్‌ను, స్విమ్మింగ్ పూల్‌ను నిర్మిస్తున్నామన్నారు. దీని డిజైన్ బాధ్యతలను తన కుమార్తె షరణికి అప్పగించానని వెల్లడించారు.

## మత సామరస్యానికి ప్రతీక.. బారాషహీద్ దర్గా



ప్రార్ధనలు నిర్వహిస్తున్న పొంగూరు షరణి

మత సామరస్యానికి ప్రతీకగా నిలచిన నెల్లూరు బారాషహీద్ దర్గాను రాష్ట్ర మంత్రి నారాయణ కుమార్తె పొంగూరు షరణి ఇటీవల సందర్శించారు. దర్గాకు ఆమె తన కుమారుడు ఆర్యన్‌తో కలిసి వచ్చి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి దర్గాకమిటీ సభ్యులు స్వాగతం పలికారు. కులమతాలకు అతీతంగా అందరినీ ఏకం చేసే పవిత్ర దర్గా బారాషహీద్ దర్గా అన్నారు. షామీభాయ్, హయాత్ బాబా, సాబిర్ ఖాన్, మొయినుద్దీన్, జాఫర్, నౌషాద్, పలువురు టీడీపీ మహిళా నేతలు పాల్గొన్నారు.

# రూరల్‌లో అభివృద్ధి పనుల జాతర!

**• 27 కోట్లతో.. 240 పనులను ప్రారంభించిన మంత్రి ఆనం**



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి ఆనం, ఎంపీ విపిఆర్, కోటంరెడ్డి సోదరులు

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల జాతర మొదలైంది. పడారుపల్లిలో ఆ పనులకు ఇటీవల రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి ప్రారంభోత్సవం చేశారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోదరుల కృషితో రూ.27 కోట్ల వ్యయంతో చేపట్టిన 240 అభివృద్ధి పనులను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి మంత్రి ఆనం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని, వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉందని అన్నారు. నెల్లూరు రూరల్‌తో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, ఇది ఒకప్పుడు తాను ప్రాతినిధ్యం వహించిన రాపూరు నియోజకవర్గ పరిధిలో భాగమని గుర్తుచేశారు. శ్రీధర్‌రెడ్డి స్వయంకృషితో ఎదిగిన నాయకుడని, కోటంరెడ్డి సోదరులకి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని చెప్పారు.

**నెల్లూరు.. 3 నియోజకవర్గాలకు పెరిగే అవకాశం :**

రాష్ట్రంలో జనగణన అనంతరం డీ-లిమిటేషన్ ప్రకారం అసెంబ్లీ స్థానాలు పెరిగే అవకాశం ఉందని, నెల్లూరు మూడు నియోజకవర్గాలుగా మారే అవకాశం ఉందని మంత్రి ఆనం అభిప్రాయపడ్డారు. కష్టపడి పనిచేసే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. రైతుల విషయం ప్రస్తావిస్తూ, అన్నదాతలకు తాము అన్నివేళలా సహకరిస్తున్నామన్నారు. జిల్లాలో 161 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, ఇప్పటికే 18,013 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో చెల్లింపులు చేస్తున్నామని తెలిపారు.ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, రూరల్ నియోజకవర్గంలోని ఆమంచర్ల వద్ద పెద్ద పరిశ్రమ రానుందని, దాని ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. రూరల్ నియోజకవర్గంలో పూర్తి చేసిన పనులు, టెండర్ దశలో ఉన్న పనులు, ప్రారంభించబోయే పనులు అన్నీ కలిపి. 613 కోట్ల వరకు ఉన్నాయని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. కొండాయపాలెం గేట్, బీవీనగర్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జ్‌కి రూ.31కోట్లు మంజూరయ్యాయని, త్వరలో టెండర్ ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. టిడ్కో చైర్మన్ అజయ్, నగర మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మేయర్ భానుశ్రీ, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

### క్షయవ్యాధి నివారణకు

## అవగాహనే ఔషధం

ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినం సందర్భంగా ఈనెల 24న నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్యకళాశాలలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. డీఎం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ సుజాత మాట్లాడుతూ, జిల్లాలో క్షయ వ్యాధి నివారణకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, కేంద్ర ప్రభుత్వం ఈ వ్యాధిని నివారించేందుకు నాణ్యమైన మందులను అందిస్తోందని చెప్పారు. అనంతరం, క్షయవ్యాధి నివారణకు కృషిచేస్తున్న పలువురు వైద్యులకు, సిబ్బందికి ప్రతిభా పురస్కారాలను అందజేశారు.

## తల గాయాలతో..పెరుగుతున్న మరణాలు

### హెల్మెట్ పెట్టుకోవాలంటున్న అపోలో హాస్పిటల్ వైద్యులు





ర్యాలీ నిర్వహిస్తున్న అపోలో వైద్యులు

ద్విచక్రవాహనదారులు హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్ల, రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా తలకి దెబ్బలు తగిలి ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని నెల్లూరులోని అపోలో ఆసుపత్రి వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 20న 'ప్రపంచ తల గాయాల దినం' సందర్భంగా నగరంలోని విఆర్‌హైస్కూలు మైదానం నుండి అపోలో హాస్పిటల్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అపోలో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, వైద్యనిపుణులు వెంకట్, ఉబేద్, శ్రీనివాస్, బిందురెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాహనదారులు హెల్మెట్ పెట్టుకోవడం వల్ల కలిగే ఉపయోగాలను తెలియజేశారు. మనదేశంలో ఏటా లక్షలాది మంది తలకి గాయాలు తగలడం వల్లనే మరణిస్తున్నారని, ప్రమాదం జరిగిన గంట లోపుగా హాస్పిటల్‌లో చేర్చగలిగితే బాధితులు బతికే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలని, వెనక కూర్చున్నవారు కూడా హెల్మెట్ ధరించాలని, మద్యపానం సేవించి డ్రైవింగ్ చేయకూడదని చెప్పారు.

# 'ఉన్నతి' ప్రాజెక్ట్ కింద..ఏపీకి ఎంత నిధి కేటాయించారు?

**• లోక్‌సభలో ఎంపీ వీపీఆర్ ప్రశ్న**



కేంద్ర ప్రభుత్వం గ్రామీణ, వెనుకబడిన, అభివృద్ధి చెందని ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించే ప్రక్రియలో భాగంగా చేపట్టిన 'ఉన్నతి' ప్రాజెక్ట్ కింద ఆంధ్రప్రదేశ్‌కు నిధులెంత కేటాయించారో తెలియజేయాలని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈనెల 24న లోక్‌సభలో కోరారు. ఈ ప్రాజెక్ట్ కింద నైపుణ్యాభివృద్ధి అవకాశాలను అందించడానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలు తదితర వివరాలు అడిగారు. అందుకు కేంద్ర వాణిజ్య మరియు పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద సమాధానం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం డిసెంబర్ 2019లో ప్రారంభించిన 'ఉన్నతి' పథకం స్వయం ఉపాధి లేదా వేతన ఉపాధి కోసం ఒక నైపుణ్యాన్ని అందించడం ద్వారా, మహాత్మాగాంధీ ఎన్‌ఆర్‌ఈజీఏ కార్మికుల జీవనోపాధిని మెరుగుపరచడం లక్ష్యంగా ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమం కింద, 2018-19 ఆర్థిక సంవత్సరం నుండి ఉపాధిహామీ పథకం కింద 100 రోజుల పనిని పూర్తిచేసిన ప్రతి కుటుంబం నుండి ఒక వయోజన సభ్యుడు (18-45 సంవత్సరాల వయస్సు) శిక్షణకు అర్హులనీ, అటువంటి కుటుంబాల నుండి శిక్షణ కోసం వ్యక్తులను ఎంపిక చేసే ప్రక్రియలో ఎస్సీ, ఎస్టీ, సంచార జాతులు, నోటిఫై చేయని తెగలు, పేదరిక రేఖకు దిగువన ఉన్న ఇతర కుటుంబాలు, మహిళా గృహయజమానులు, శారీరకంగా వికలాంగులైన గృహ పెద్దలు, భూ సంస్కరణల లబ్ధిదారులు, ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ కింద లబ్ధిదారులు, అటవీ హక్కుల గుర్తింపు చట్టం-2006 కింద లబ్ధిదారులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎంపిక అయిన కుటుంబానికి సామాజిక ఆర్థిక కుల గణన వెనుకబాటు ప్రమాణాల ఆధారంగా ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుందన్నారు. 2020-2021 ఆర్థిక సంవత్సరంలో ప్రాజెక్ట్ ఉన్నతి కింద భారత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 7.64 కోట్లు విడుదల చేసిందన్నారు. గత ఐదేళ్లలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన కింద 1108.24 కోట్లు కేటాయించబడ్డాయని కేంద్రమంత్రి వివరించారు.




# జిల్లాలో గిరిజనుల స్థితి దయనీయం!

**● జాతీయ కమిషన్ ఛైర్మెన్‌కి వివరించిన సోమిరెడ్డి**



జాతీయ కమిషన్ ఛైర్మెన్ అంతర్‌సింగ్‌కి గిరిజనుల స్థితిగతులను తెలుపుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

జిల్లాలోని గిరిజనుల బాగుకు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు చేసిన విజ్ఞప్తులు కార్యరూపం ధరించేందుకు మార్గం సుగమమైంది. ఇటీవల నెల్లూరుకు వచ్చిన జాతీయ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కమిషన్ ఛైర్మెన్ అంతర్‌సింగ్ ఆర్యని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కలిసి, ప్రధానంగా చల్లా యానాదుల దుస్థితిని వివరించారు. జిల్లా జనాభాలో 16 శాతం మంది గిరిజనులు ఉన్నారని, వారు కనీసం ఆధార్‌కార్డులకు కూడా నోచుకోని పరిస్థితిలో ఉన్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సర్వేపల్లి నియోజకవర్గంలో వారి కోసం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించి 3వేల మందికి ఆధార్ కార్డులు ఇప్పించామన్నారు. కేంద్ర ప్రభుత్వం గిరిజనుల కోసం దేశవ్యాప్తంగా అమలుచేస్తున్న అన్ని పథకాలను నెల్లూరుజిల్లాలోని మైదాన ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులకు కూడా వర్తింపజేయాలని సోమిరెడ్డి కోరారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన సమీక్షా సమావేశంలో కమిషన్ ఛైర్మెన్ అంతర్‌సింగ్ ఆర్య పాల్గొని, జిల్లాలో గిరిజనులకు అమలవుతున్న సంక్షేమ–అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. సోమిరెడ్డితో పాటు ఎమ్మెల్యేలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కాకర్ల సురేష్ తదితరులు కమిషన్ ఛైర్మెన్‌కి గిరిజనుల జీవన స్థితిగతులను వివరించారు.

# ఎన్‌బీకేఆర్‌లో.. 'మెక్నోడియా–2026'




రమేష్‌చంద్ర సింగ్‌కి జ్ఞాపికను అందజేస్తున్న డా. వి.విజయకుమార్‌రెడ్డి

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 25న మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'మెక్నోడియా–2026' వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా మెయిడన్ టీ అండ్ డీ ఇండియా లిమిటెడ్ (నాయుడుపేట)కు చెందిన ప్లాంట్ హెడ్ రమేష్‌చంద్ర సింగ్ పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు సోషల్ మీడియాలో గడుపుతూ సమయాన్ని వృథా చేసుకోవద్దని, సమయపాలన తప్పకుండా పాటించాలని చెప్పారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, రీసెర్చ్ డీన్ డా.సిహెచ్‌ఆర్ విక్రమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ అంశాలపై నిర్వహించిన పోటీల్లో విజేతలైనవారికి ప్రిన్సిపాల్ డా.ఎం. శ్రీనివాసులు చేతులమీదుగా బహుమతులు అందజేశారు. కళాశాల విభాగాధిపతి డా. పి.శ్రీహరిరెడ్డి, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. బి.మధుసూదన్‌రెడ్డి, డీన్ డా.జి. హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆ ఆరోపణలన్నీ అసత్యాలే!

**● రాజ్యసభ సభ్యులు బీఎంఆర్**



మత్స్యకారుల గ్రామాల కాపులు, పెద్ద మనుషులు, మహిళలు, యువతకు తమిళనాడు బోట్ల విడుదల విషయంలో ఇటీవల తనపై వస్తున్న ఆరోపణలన్నీ అసత్యమేనని, సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న అలాంటి దుష్ప్రచారాలను నమ్మవద్దని రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు (బీఎంఆర్) కోరారు. గత 8 నెలలుగా తమిళనాడు బోట్ల విషయంలో తమిళనాడు బోట్ల యజమానులకు, మన జిల్లాలోని మత్స్యకార గ్రామాలకు జరుగుతున్న వివాదంలో నేను ఏ అధికారులతో గాని, మత్స్యకార గ్రామ పెద్దలతో గానీ చర్చించలేదని ఆయన స్పష్టం చేశారు.

ఇతర రాష్ట్రాల బోట్ల విషయంలో వస్తున్న సమస్యలను పరిష్కరించేందుకు నెల్లూరుజిల్లా మత్స్యకారులు ఉమ్మడిగా నిర్ణయం తీసుకున్నారని, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రభుత్వాలు ఆ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలని వారు చేస్తున్న పోరాటానికి, వారి మనోభావాలకి, ప్రయోజనాలకి విరుద్ధంగా తాను ఏనాడూ ప్రయత్నం చేయలేదన్నారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని తాను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ప్రభుత్వ అధికారులకి విజ్ఞప్తి చేసినట్లు ఆయన తెలిపారు. అంతేకాదు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, కేంద్ర హోం మంత్రి అమిత్ షాకి, కేంద్ర మత్స్య శాఖ మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్‌కి కూడా ఈ విషయాలన్నిటినీ తెలిపి, వాటిపై సమగ్ర విచారణ జరిపి ఆ దుష్ప్రచారం వెనుక వున్న వాస్తవాలను బయట పెట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతానని కూడా ఆయన చెప్పారు. నిరంతరం ప్రజాసేవలో నిమగ్నమైన తనపై నిరాధార ఆరోపణలు చేయడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకారుల సంక్షేమం కోసం తాను అహర్నిశలు కృషి చేస్తున్నానన్నారు. మత్స్యకార గ్రామాల ప్రయోజనాలకు, ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా తాను ఇప్పుడే కాదు, భవిష్యత్తులో కూడా ఏ పొరపాటూ చేయనని స్పష్టం చేశారు.

## గూడూరు డివిజన్

# వైభవంగా కోదండరాముని బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

తమ్మినపట్నం గ్రామంలోని శ్రీ కోదండరామస్వామి వారి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు ఈ నెల 25 నుండి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 31వ తేదీ వరకు జరిగే ఈ బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికను ఇటీవల గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఆవిష్కరించారు. దేవస్థానం ఛైర్మెన్ కోట సతీష్‌యాదవ్, కార్యనిర్వహణాధికారి వి.గిరికృష్ణ, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం



డ్రగ్స్ వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యమని డి.వై.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి ఏం.వి.రమణ, ఐద్వా జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్‌బిలు పేర్కొనారు. సోమవారం గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్‌కి జీపు జాతా చేరుకుంది. గూడూరు సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్తుపదార్థాల కట్టడిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయన్నారు. రోజురోజుకి గంజాయి, మత్తు పదార్థాల మాఫియాలో యువత చిక్కుకొని జీవితాలు చిన్నాభిన్నం చేసుకుంటున్నాయన్నారు. నెల్లూరుజిల్లాలో గంజాయి ముఠాకి వ్యతిరేకంగా పోరాడి హత్యకు గురైన సీపీఐ నాయకులు పెంచలయ్య కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం ప్రకటించాలన్నారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బి.పి.నరసింహ, ఐద్వా జిల్లా అధ్యక్షులు టి.శివకుమారి, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## పిరమిడ్ ధ్యాన ఆశ్రమంలో..

# శిక్షణ కార్యక్రమాలు



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న నిర్వాహకులు

గూడూరు, కాశీ లే–అవుట్‌లోని బుద్ధ పిరమిడ్ ధ్యాన ఆశ్రమంలో రెండు రోజుల పాటు చాణక్య ఆధ్యాత్మిక పాలన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 21న ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ రోహిణి జ్యోతిప్రజ్వలన చేసి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో లీడర్షిప్‌ను పెంపొందించి, అందరూ ఆరోగ్యంగా జీవించేందుకు ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలియజేశారు. ఆశ్రమ నిర్వాహకులు చంద్రశేఖర్, లత, దేవరాజు, నాగమణి, ఉదయలక్ష్మి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# నూతన పీఆర్సీనీ వెంటనే అమలు చేయాలి



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న యూటిఎఫ్ నాయకులు

కూటమి ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు గడిచినా నూతన పిఆర్సీ కమిషన్ ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదని.. ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు రవి డిమాండ్ చేశారు. గూడూరులోని సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరాహార దీక్షలు ప్రారంభించారు. తమ డిమాండ్ల పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు రవి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు నాలుగు డిఏలు పెండింగ్లో ఉన్నాయని, కరోనా సమయంలో చనిపోయిన ఉపాధ్యాయుల కుటుంబాల్లో వారికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ దీక్షల్లో ఖాజావలి, జనార్ధన్, సుధీర్, కోటేశ్వరరావు, వాసుదేవరావు, ప్రసాద్ మురళి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# అవగాహనతోనే క్షయ వ్యాధి నివారణ



టీబీ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు, ఆరోగ్య సిబ్బంది

ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మరియు ఆరోగ్య సిబ్బంది ప్రజలకు టీబీ వ్యాధిపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో టీబీ నిర్ధారణకు కఫం పరీక్ష, రక్తపరీక్ష, ఛాతీ ఎక్స్‌రే మరియు సీటీ స్కాన్ సదుపాయాలు ఉన్నాయని, నెల్లూరు మరియు తిరుపతి రుయా ఆసుపత్రుల్లోని పల్మనాలజీ విభాగాల్లో అత్యంత నైపుణ్యం కలిగిన వైద్యులు సేవలు అందిస్తున్నారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గూడూరు టీబీ యూనిట్ అధికారి సురేంద్రరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ గడ్డం నాగేశ్వరరెడ్డి, సూపర్‌వైజర్లు ఎన్.అరుణ, ఐ.ఉమ, వరప్రసాద్, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కార్మికులకు ఈఎస్ఐ సేవలు అందాలి



మెడికల్ ఆఫీసర్‌తో మాట్లాడుతున్న డాక్టర్ పద్మజ

గూడూరు, గమల్లపాలెంలోని ఈఎస్ఐ హాస్పిటల్‌ను ఈ.ఎన్.ఐ రాయలసీమ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పద్మజా ఇటీవల తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వైద్యసేవలు, మందుల నిల్వ గురించి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిషోర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మజ మాట్లాడుతూ ఈ.ఎస్.ఐ హాస్పిటల్స్ ద్వారా కల్పించే సౌకర్యాల గురించి కంపెనీలలో పనిచేస్తున్న వారికి తెలియడం లేదని, వీటి గురించి కార్మికులకు తెలిసేలా క్యాంపులు ఏర్పాటు చేసి తెలియజేస్తామని వెల్లడించారు.


సమీక్షా సమావేశంలో పాల్గొన్న హిందూ చైతన్య వేదిక ప్రతినిధులు

# 'హనుమభక్త శోభాయాత్ర'కు సన్నాహాలు

## • 5న.. నగరంలో భారీ బైక్‌ర్యాలీ

హిందూ ధర్మాన్ని పరిరక్షించుకునే కార్యక్రమాల్లో భాగంగా, ఏప్రిల్ 5న నెల్లూరు నగరంలో హనుమభక్త శోభాయాత్రను నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ఆరోజున భారీ స్థాయిలో బైక్ ర్యాలీకి సమాయత్తమవుతున్నారు. ఆ ఏర్పాట్లపై ఈనెల 22న సమీక్ష జరిగింది.

## గోవాలో ఆకట్టుకున్న..

# దోర్నాల 'హాస్యవల్లరి'


దోర్నాలని సత్కరిస్తున్న అశోక్ గజపతిరాజు

నెల్లూరుకు చెందిన ప్రముఖ హాస్య నటుడు దోర్నాల హరిబాబు ఆధ్వర్యంలో ఇటీవల గోవాలో నిర్వహించిన 'హాస్యవల్లరి' అక్కడి ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకొని కేంద్ర పాలిత ప్రాంతమైన గోవాలోని ఆంధ్ర సంఘం, పనాజీ స్వర్ణోత్సవ సంబరాలు జరిగాయి. గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు ముఖ్యఅతిథిగా పాల్గొని దోర్నాల హరిబాబుని సత్కరించి, కళాకారులను అభినందించారు.

# పన్ను కట్టకుంటే..కుళాయి కట్!


కుళాయి కనెక్షన్‌ని కట్ చేస్తున్న అధికారులు

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తిపన్నుల బకాయిలు భారీగా పేరుకుపోవడంతో, అధికారులు పన్నుల వసూలుకు గట్టి చర్యలు తీసుకుంటున్నారు. టెక్కేమిట్టలో చాలాకాలం నుంచి బకాయిలున్న ఇద్దరి ఇళ్లలో ఈనెల 23న మంచినీటి కుళాయిలను కట్ చేశారు. వారిలో ఒకరు 2లక్షలకుపైగా, మరొకరు లక్షకి పైగానే బకాయిలున్నారని, ఎన్నిసార్లు నోటీసులు పంపినా పట్టించుకోవడం లేదని అధికారులు చెప్తున్నారు. బకాయిలున్నవారు వెంటనే చెల్లించాలని వారు కోరుతున్నారు.

## వేదగిరి బ్రహ్మోత్సవాలకు..

# స్తంభ ప్రతిష్ఠ



నెల్లూరు రూరల్ మండలంలోని శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 26 నుంచి మే 6వ తేదీ వరకు జరుగనున్న నేపథ్యంలో, ఈనెల25న ఆలయ ప్రాంగణంలో శాస్త్రోక్తంగా స్తంభ ప్రతిష్ఠ చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు నేతృత్వంలో, కార్య నిర్వహణాధికారి గోపి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం వేడుకగా జరిగింది.

# శ్మశానాలు మహాప్రస్థానాలుగా రూపాంతరం చెందాలి

## • జక్కా శివనారాయణరెడ్డి


ఆధునీకరించిన 'మహాప్రస్థానాన్ని' ప్రారంభిస్తున్న జక్కా శివనారాయణరెడ్డి

శ్మశానవాటిక అనే పేరు చెరిగిపోయి "మహాప్రస్థానం" అన్న పేరు వాడుకలోకి రావాలని, ఆ విధంగా నగరాలలో, పట్టణాలలో, పల్లె ప్రాంతాలలో వుండే శ్మశానాలని దాతల సహకారంతో ఆయాప్రాంత ప్రజలు బాగుచేసుకోవాలని రైతు నాయకుడు స్వర్గీయ జక్కారంగారెడ్డి కుమారుడు, నెల్లూరు మాజీ శాసనసభ్యుడు జే.కే.రెడ్డికి స్వయానా తమ్ముడు, ప్రముఖ కాంట్రాక్టర్ జక్కా శివనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. తమ స్వగ్రామం ఇందుకూరుపేట మండలంలోని జగదేవిపేటలో ఆధునీకరించబడిన మహాప్రస్థానం ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన ఈ మాట చెప్పారు. గ్రామ ప్రజలు సైతం పార్టీల కతీతంగా అందరూ ఒక్కటై ఆర్థికంగా, హార్దికంగా తమకి సహకరించినందుకు శివనారాయణరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మహా ప్రస్థానం నిర్వహణ కోసం ఒక సొసైటీగా ఏర్పడి నిర్వహిస్తామన్నారు. గ్రామస్తులంతా కలసి వస్తే జగదేవిపేటని మోడల్ గ్రామంగా తీర్చిదిద్దవచ్చని అన్నారు.

జగదేవిపేట గ్రామంలో ఎన్నో తరాల నుంచి వున్న పురాతన శ్మశాన వాటికని సకల వసతులతో ఆధునీకరించి మార్చి 25 బుధవారం నాడు గ్రామ ప్రజలకి అంకితం చేశారు. శివనారాయణరెడ్డి ఇచ్చిన స్ఫూర్తితో అదే గ్రామానికి చెందిన తిక్కవరపు వంశీరామ్‌రెడ్డి, యడవల్లి యుగంధర్‌రెడ్డిలతో పాటు ఆ గ్రామంతో సంబంధం లేని దొడ్ల భరత్‌కుమార్‌రెడ్డి కూడా తనవంతు సహకారాన్ని అందించారు. రెడ్డిజనసేవా సంఘం తరపున జే.కే.రెడ్డి కూడా ఈ బృహత్ కార్యక్రమానికి అండగా నిలిచారు.

ఈ కార్యక్రమంలో దొడ్ల భరత్‌రెడ్డి మాట్లాడుతూ రోటరీ ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలోని కైలాస భూమిని ఆధునీకరించిన సమయంలో ఆయన ఎదుర్కొన్న ఇబ్బందులని వివరించారు. జగదేవిపేట లాంటి చిన్న గ్రామంలో ఇంత అద్భుతంగా మహాప్రస్థానాన్ని తీర్చిదిద్దడం సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ అంశం అన్నారు. శివనారాయణరెడ్డితో పాటు గ్రామస్థులని కూడా భరత్‌రెడ్డి అభినందించారు. నిర్వహణలో కూడా ఇదే శ్రద్ధ చూపించి దీన్ని కాపాడుకోవాలని అన్నారు. దాతల సహకారంతో స్నానపు గదులు, వెయిటింగ్ హాల్, కర్మక్రతువుల నిర్వహణకు అవసరమైన వేదిక అన్నీ పూర్తిస్థాయిలో ఇక్కడ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం కోసం పూర్తిగా ఉచితంగా తన సేవలందించిన ఆర్కిటెక్ట్ ప్రదీప్‌రెడ్డితో పాటు సహకరించిన వారందరిని ఈ సందర్భంగా గ్రామస్థుల తరపున అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# ఆంగ్లభాషా నైపుణ్యం.. విద్యార్థి భవితకు దారిదీపం!

జ్ఞాన నేత్రం
డా. నరసింహారెడ్డి ఊరిమిండి
Dallas, Texas, USA

"జీవితం కోసం మన భాష, జీతం కోసం పరభాష" అవసరం అన్న విషయాన్ని బాగా నమ్మేవారిలో నేనూ ఉంటాను. ఈ వ్యాసం తెలుగు భాషను తక్కువ చెయ్యడం కాదు. మన భాష తప్పక నేర్చుకొని అనర్గళంగా మాట్లాడడమే కాకుండా, భారత దేశం ప్రపంచానికి అందించిన మన భాషా సిరిసంపదలను తెలుగులో చదివినా, విన్నా జీవితానికి అవసరమయ్యే వ్యక్తిత్వ వికాసం లభిస్తుంది. అయితే, ఇప్పుడు మనం ఇంగ్లీషు భాష యొక్క ప్రాధాన్యతను, నేర్చుకోవడానికి అవసరమైన సూచనలు తెలుసుకుందాం. ఇంగ్లీష్ భాష నేటి విద్యా ప్రపంచానికి ఒక తాళం చెవి లాంటిది. అది చేతిలో ఉన్న విద్యార్థి ముందు తెరుచుకునే తలుపులు అనేకం. ప్రపంచ జ్ఞానం, పరిశోధన, సాంకేతికత, ఉన్నత విద్య... ఇవన్నీ ఇంగ్లీష్ ద్వారానే మనముందుకు వస్తాయి. అందుకే పెద్దలుచెప్పినట్లుగా 'భాష వస్తే..భవిష్యత్తు వచ్చినట్లే' అన్న మాట నేటికాలంలో మరింత సత్యం. ఇంగ్లీష్ నేర్చుకోవడం అంటే కేవలం పరీక్షల్లో మార్కులు తెచ్చుకోవడం కాదు; అది ఒక జీవన నైపుణ్యం. విద్యార్థి ఇంగ్లీష్‌లో నైపుణ్యం సాధిస్తే పాఠ్యపుస్తకాలు సులభంగా అర్థమవుతాయి, ప్రపంచంతో సంభాషించగలుగుతాడు, ఉద్యోగ అవకాశాలు విస్తరిస్తాయి, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది కూడా. అయితే, చాలామంది విద్యార్థులకు ఇంగ్లీష్ అంటే భయం. వ్యాకరణం కఠినమని భావించడం, తప్పు మాట్లాడితే నవ్వుతారనే భయం, పదసంపద తక్కువగా ఉండటం..ఇవి సాధారణ కారణాలు. కానీ నిజం ఏమిటంటే 'భయం ఉన్న చోటే అభివృద్ధికి అవకాశం ఉంటుంది'. ఇంగ్లీష్ నేర్చుకోవడం ఒక పర్వతారోహణ కాదు; అది ఒక రోజువారీ అలవాటు. చిన్నచిన్న ప్రయత్నాలు పెద్ద మార్పులకు దారితీస్తాయి. ఒక విద్యార్థి రోజుకు కొద్దిసేపు ఇంగ్లీష్‌ను తన జీవితంలో భాగం చేసుకుంటే, ఆ భయం క్రమంగా తగ్గిపోతుంది. భాషపై పట్టు పెరుగుతుంది. 'నెమ్మదిగా నడిచినా.. నడక ఆగకపోతే చాలు.. గమ్యం చేరుతాడు'.

## ఇంగ్లీష్‌లో నైపుణ్యం సాధించాలి :

ప్రపంచజ్ఞానాన్ని పొందేందుకు, ఉద్యోగావకాశాలు మరింతగా అందుకునేందుకు ఇంగ్లీష్‌లో నైపుణ్యం సాధించాలి. అందుకు ఇంగ్లీష్ చదవడం, వినడం, మాట్లాడడం, రాయడం అనే నాలుగు పునాదులు సహజంగానే విద్యార్థి జీవితంలో కలిసిపోవాలి. చదవడం వల్ల పదసంపద పెరుగుతుంది, వాక్య నిర్మాణం సహజంగా అర్థమవుతుంది, ఆలోచన శక్తి పదునెక్కుతుంది. రోజుకు ఓ ముప్పై నిమిషాలు అయినా ఇంగ్లీష్ చదవడం విద్యార్థి మనసులో ఆంగ్లభాషపై ఒక సాన్నిహిత్యాన్ని పెంచుతుంది. వినడం కూడా అంతే ముఖ్యమైనది. 'విన్నవాడు విజ్ఞానవంతుడు' అన్న సూత్రం ఇక్కడ సరిగ్గా సరిపోతుంది. ఇంగ్లీష్ సంభాషణలు, ముఖాముఖి, మహనీయుల స్వీయచరిత్రలు వింటూ ఉంటే భాష యొక్క సహజ ప్రవాహం మనకు అలవాటు అవుతుంది. మాట్లాడడం భయాన్ని తొలగించే మొదటి మెట్టు. "మాటలే మనిషిని మలుస్తాయి"అన్న మాటను గుర్తుంచుకుంటే, రోజుకు అయిదు నిమిషాలు అయినా ఇంగ్లీష్‌లో మాట్లాడటం ఒక గొప్ప సాధన అవుతుంది. తప్పులు చేయడం సహజం; తప్పు చేసినవాడే వాటిని సరిదిద్దుకుని సరైన దారి చేరుతాడు. రాయడం ద్వారా ఆలోచనలకు క్రమం వస్తుంది. ఒక అర్ధ పేజీ అయినా రాయడం వలన వ్యాకరణం కూడా మెరుగవుతుంది. ఈ నాలుగు పునాదులు కలిసి విద్యార్థిలో ఒక కొత్త ఆత్మవిశ్వాసాన్ని నిర్మిస్తాయి. భాషపై పట్టు పెరిగిన కొద్దీ, విద్యార్థి తన చదువును కొత్త కోణంలో చూడగలుగుతాడు. పాఠ్యపుస్తకాలు చదవడం సులభమవుతుంది. "అర్థం తెలిసిన విద్యార్థి అర్ధరాత్రికైనా చదువుతాడు' అన్నట్లుగా, ఇంగ్లీష్ నైపుణ్యం ఉన్న విద్యార్థి ఉన్నత విద్యలోనూ, పరిశోధనలోనూ, ప్రపంచ స్థాయి అవకాశాల్లోనూ ముందంజలో ఉంటాడు. కొత్త భాషను నేర్చుకోవడం అంటే కేవలం పదాలు కూర్చడం కాదు; అది మన ఆలోచనలను విస్తరించే ఒక అంతర్గత యాత్ర. ఇంగ్లీష్ నేర్చుకునే విద్యార్థి తనలోని సందేహాలను, సంకోచాలను, భయాలను ఒక్కొక్కటిగా తొలగించుకుంటూ ముందుకు సాగుతాడు. ఈ ప్రయాణంలో అతను గ్రహించే గొప్ప సత్యం ఏమిటంటే "సాధన చేసినవాడికి సాధ్యం కానిది ఏమీలేదు' అన్న సంగతి.

## జ్ఞానానికి గ్లోబల్ గేట్‌వే.. ఇంగ్లీషే!

ఇంగ్లీష్ నైపుణ్యం విద్యార్థి జీవితాన్ని మార్చే శక్తి కలిగినదంటే అతిశయోక్తి కాదు. ఆంగ్లభాష విద్యార్థి భవితకు దిక్సూచీ అవుతుంది. ఎందుకంటే, ఉన్నతవిద్యలో ఇంజనీరింగు, మెడిసిన్, పరిశోధన, అన్నీ ఇంగ్లీష్ ఆధారిత రంగాలు. ఇంగ్లీష్ అర్థమైతే ప్రపంచస్థాయి జ్ఞానం విద్యార్థికి అందుబాటులోకి వస్తుంది. ఉద్యోగాల్లో కూడా ఇంగ్లీష్ ఒక కీలక పాత్ర పోషిస్తుంది.రెస్యూమ్, ముఖాముఖి, సభాప్రసంగాలు ఇవన్నీ ఇంగ్లీష్‌లోనే జరుగుతాయి. అందుకే ఇంగ్లీష్‌లోనూ నైపుణ్యం సాధించాలి. ఇంగ్లీష్ మాట్లాడగలిగిన విద్యార్థి తరగతిలోనూ, వేదికపైనా, ఇంటర్వ్యూలలోనూ, సమూహ చర్చల్లోనూ నిర్భయంగా మాట్లాడగలుగుతాడు. ఆత్మవిశ్వాసం అతని వ్యక్తిత్వంలో ఒక వెలుగు రేఖలా మారుతుంది. ఎందుకంటే, ఇంగ్లీష్ అనేది జ్ఞానానికి గ్లోబల్ గేట్‌వే అన్నది గుర్తుంచుకోవాలి. "జ్ఞానం ఉన్నవాడికి ప్రపంచం చిన్నదవుతుంది'. ప్రపంచాన్ని అర్థం చేసుకునే శక్తి, కొత్త ఆలోచనలను గ్రహించే సామర్థ్యం, పరిశోధనను అనుసరించే నైపుణ్యం. ఇవన్నీ ఇంగ్లీష్ ద్వారా విద్యార్థికి లభిస్తాయి. అయితే, ఇంగ్లీష్ నేర్చుకోవడం ఒక రోజుతో అయ్యే పని కాదు; అది ఒక అలవాటుగా మారాలి. ఒక ప్రయాణం, ఒక పట్టుదల. కృషి-దీక్షతో చదువును ముందుకు సాగించాలి. రోజూ ఓ అర్ధగంట సమయాన్ని ఇంగ్లీష్‌కు కేటాయిస్తే ఒక నెలలోనే మార్పు కనిపిస్తుంది, ఆరు నెలల్లో నైపుణ్యం వస్తుంది, ఒక సంవత్సరంలో విద్యార్థి జీవితం మారిపోతుంది. ఇంగ్లీష్ నైపుణ్యం విద్యార్థికి ఎగరడానికి రెక్కలను ఇస్తుంది. ఆ రెక్కలతో సమున్నత లక్ష్యాలను సాధించుకోవాలి.



**వచ్చే వారం :** భయంలేని గణితం : సంఖ్యలపై నమ్మకం ఎలా పెంచుకోవాలి!

E-mail: reddyu@gmail.com

## కళ్యాణ వైభవం...!




గుంటూరు వాస్తవ్యులు, నెల్లూరీయులకి చిరపరిచితులు, ప్రస్తుత నెల్లూరువాసి, రిటైర్డ్ అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు వి.ఎస్.రాంబాబు - వెంకటేశ్వరమ్మల కుమారుడు **శ్రీనివాస ప్రదీప్ - రూపశ్రీ**ల పరిణయం మార్చి 20వ తేదీ గుంటూరులో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభదీవెనలు.

# మత్స్యకార వివాదాన్ని పరిష్కరించండి

**• కేంద్ర మత్స్యశాఖ మంత్రికి బీఎంఆర్ వినతి**



తమిళనాడు మరియు పుదుచ్చేరి ప్రాంతాలకు చెందిన మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్లు ఆంధ్రప్రదేశ్ సముద్ర జలాల్లోకి అక్రమంగా ప్రవేశించి చేపల వేట కొనసాగించడం వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్యకారులకు తీవ్ర నష్టం జరుగుతోందని, ఈ అంతర్రాష్ట్ర వివాదాన్ని పరిష్కరించాలని కేంద్ర మత్స్యశాఖ సహాయ మంత్రి ప్రొఫెసర్ ఎస్.పి.సింగ్ బఘేల్‌ను కోరుతూ రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు ఈనెల 25న ఢిల్లీలో ఆయనకి వినతిపత్రం సమర్పించారు. ఆ సమస్యల వల్ల స్థానిక మత్స్యకారుల వలలు దెబ్బతినడం, చేపల నిల్వలు తగ్గిపోవడం, వారి జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం పడుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల అధికారులతో సత్వరం త్రిపాక్షిక సమావేశం నిర్వహించడం, దక్షిణ ప్రాంతీయ ఫిషరీస్ మేనేజ్‌మెంట్ కౌన్సిల్‌ను బలోపేతం చేయడం, తీర ప్రాంత గస్తీ చర్యలను పెంచడం, పులికాట్ సరస్సు ఇరువైపుల డ్రెడ్జింగ్ చేపట్టడం వంటి చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తిచేశారు. అందుకు కేంద్రమంత్రి స్పందిస్తూ వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# డ్రగ్స్‌పై.. ఉక్కుపాదం!



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు, ఎస్పీ అజిత

జిల్లాలో డ్రగ్స్ నియంత్రణకు జిల్లా అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించారు. డ్రగ్స్ క్రయవిక్రయాలపై ఉక్కుపాదం మోపనున్నారు. ఈనెల 25న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల డ్రగ్స్‌కి సంబంధించిన నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీతో సమావేశమయ్యారు. డ్రగ్స్ నిరోధానికి తీసుకోవాల్సిన చర్యలను చర్చించారు. జిల్లా ముఖద్వారాల వద్ద వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని, అటవీ ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా పర్యవేక్షణ, పోర్ట్ ప్రాంతాల్లో కంటైనర్ల తనిఖీలు, రోడ్డు మార్గాల్లో వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని, అనుమానాస్పద ప్రాంతాల్లో కార్డెన్ సర్చ్ చేయాలని నిర్ణయించారు. డ్రగ్స్ నేరస్తులపై కఠినచర్యలు తీసుకోవాలని, డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలను విద్యాసంస్థల్లో విస్తృతంగా తెలియజెప్పాలని నిర్ణయించారు. గ్రామ స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి, మాదకద్రవ్యాలకి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం పెంచాలని సంకల్పించారు.

# 'పూండ్ల' వెంకురెడ్డి దాతృత్వం!

**రాధాకృష్ణుల మందిరానికి.. 5 లక్షల విరాళం**



విరాళాన్నందజేస్తున్న పూండ్ల వెంకురెడ్డి

ప్రముఖ దాత, సామాజిక-ఆధ్యాత్మిక సేవాతత్పరులు పూండ్ల వెంకురెడ్డి-ఆయన సతీమణి అరుణమ్మ ఇటీవల పొదలకూరు మండలంలోని మహమ్మదాపురం గ్రామంలో శ్రీ రాధాకృష్ణ మందిర నిర్మాణానికి 5 లక్షల వెయ్యిన్నూట పదహారు రూపాయలను విరాళంగా సమర్పించారు. ఆమేరకు ఆ మొత్తాన్ని వారు ఇటీవల మందిర నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. మానవసేవ-మాధవసేవలలో తరిస్తూ, తమ దాతృత్వంతో జిల్లాలో అనేక ధార్మిక సేవా కార్యక్రమాలను నిర్వహించిన తమ తండ్రి స్వర్గీయ పూండ్ల చెంచురెడ్డి-మాతృమూర్తి కామేశ్వరమ్మల జ్ఞాపకార్థం వారు ఆ విరాళాన్ని మందిర నిర్మాణానికి అందజేయడం విశేషం! ఈ సందర్భంగా పూండ్ల వారి కుటుంబసభ్యుల ఆధ్యాత్మికసేవలను కమిటీవారు ప్రశంసిస్తూ, ఆ శ్రీకృష్ణపరమాత్మ ఎల్లవేళలా వారికి తన కృపాకటాక్షాలను ప్రసాదించాలని ఆకాంక్షించారు.

## పరిశ్రమలకు గ్రీన్ రేటింగ్‌పై..

# శ్రీసిటీలో అవగాహన సదస్సు



గ్రీన్ బిల్డింగ్ అండ్ ఇండస్ట్రీస్ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న అతిథులు

రాష్ట్రంలోని పరిశ్రమలలో సుస్థిర విధానాలు, గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలను ప్రోత్సహిస్తూ ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీ పీసీబీ), భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) సంయుక్తంగా ఈనెల 25న శ్రీసిటీలో 'గ్రీన్ రేటింగ్' అవగాహన సదస్సును నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఏపీపీఎస్‌బీ చైర్మన్ డా. పి.కృష్ణయ్య మాట్లాడుతూ, పరిశ్రమల అభివృద్ధిలో పర్యావరణ పరిరక్షణ కూడా భాగం కావాలని, అందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని చెప్పారు. శ్రీసిటీలో గ్రీన్ రేటింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించినందుకు శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఈ సందర్భంగా డా. కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. హరిత భవనాలు, పునరుత్పాదక శక్తి వినియోగం, సమర్థవంతమైన నీటి మరియు వ్యర్థాల నిర్వహణ, ఇలా ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. సీఐఐ గ్రీన్‌కో దక్షిణ ఆంధ్రప్రదేశ్ క్లస్టర్ చైర్మన్ నిహాల్ కౌల్ మాట్లాడుతూ, ఇంధన శక్తి, నీరు, వ్యర్థాల వినియోగాన్ని క్రమబద్ధం చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు కంపెనీకి లాభాలు కూడా సాధ్యమవుతాయని చెప్పారు. పరిశ్రమలు పర్యావరణ హిత సుస్థిర అభివృద్ధి దృక్పథాన్ని ముందుకు తీసుకెళ్లడంలో గ్రీన్‌కో మరియు ఐజీబీసీ రేటింగ్స్ కీలకపాత్ర పోషిస్తున్నాయని, ఈ ప్రక్రియలో శ్రీసిటీ దీనికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సీఐఐ గ్రీన్ బిజినెస్ సెంటర్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. ఎస్.ముత్తుసెల్వియన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక హంగులతో.. ముస్తాబవుతున్న

# లీలామహల్

**75 సంవత్సరాలుగా అలరిస్తున్న సింగిల్ స్క్రీన్ సినిమా హాలు**



నెల్లూరు నగరంలో గత 7 దశాబ్దాలుగా లీలామహల్ అంటే తెలియని వారుండరు. ముఖ్యంగా ఇంగ్లీషు సినిమాలపై మోజు ఉందేవాళ్ళకి నెల్లూరు లీలామహల్ ఒక అడ్డా. మారుతున్న కాలంతో పాటు నెల్లూరులో ఉన్న సింగిల్ స్క్రీన్ సినిమా హాళ్ళన్నీ ఒక్కొక్కటిగా మూతబడిపోయాయి. మల్టీస్క్రీన్‌ల సంస్కృతి రావడంతో పాతవాటికి ఆదరణ తగ్గిపోయింది.

అయితే, గత కొంత కాలంగా మూతబడిపోయిన నెల్లూరు లీలామహల్ పూర్వ వైభవాన్ని తగ్గనీయకుండా అధునాతన వసతులతో, అత్యాధునిక సాంకేతిక పరికరాలతో మాగుంట కుటుంబానికి చెందిన ఆదిత్యరెడ్డి ముస్తాబు చేస్తున్నాడు. సినీ అభిమానులు ఆశ్చర్యపడేలా లీలామహల్ ప్రాంగణ రూపురేఖల్ని మొత్తం మార్చేశారు. ప్రేక్షకుల సౌలభ్యం కోసం విశాలమైన రెండు లాబీలని, మరో రెండు లాంజ్‌లని ఏర్పాటు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారిగా హాలు మొత్తం రిక్లైనర్ సీట్లని అమర్చారు. అందు కోసం 426 సీట్లని 216కి కుదించారు. వీటిలో క్రింది అంతస్తులో 102 పూర్తి స్థాయి రిక్లైనర్‌లు, పై అంతస్తులో 114 సెమీ రిక్లైనర్‌లని సినీ ప్రేక్షకులకి అందిస్తున్నారు. విరామ సమయంలో తమకి కావలసిన పదార్థాలు, పానీయాలు సీట్లో కూర్చునే ఆర్డర్ చేసేలా స్కానర్లు పెడుతున్నారు. బార్కో 4కే లేజర్ డిజిటల్ ప్రొజెక్టర్‌ని, అలాగే డాల్బీ అట్మోస్ 63 ఛానల్ సౌండ్ సిస్టమ్‌ని మొట్టమొదటి సారిగా నెల్లూరీయులకి పరిచయం చేస్తున్నారు. మల్టీస్క్రీన్ తరహాలోనే ఒకేరోజు వివిధ సమయాలలో వేరు వేరు సినిమాలని ఇక్కడ ప్రదర్శిస్తారు. భవిష్యత్తులో ఇదే ప్రాంగణంలో సుమారు 100 మందికి ఆతిథ్యం ఇచ్చేలా ఒక అధునాతన రెస్టారెంట్‌ని కూడా ఏర్పాటు చేయనున్నారు. మొత్తంమీద సినీ అభిమానులు ఔరా! అని అబ్బురపడేలా లీలామహల్‌ని భారీ ఖర్చుతో అందంగా, అపురూపంగా, ఆకర్షణీయంగా తయారు చేసి ఏప్రిల్‌లో పునః ప్రారంభిస్తున్న ఆదిత్యరెడ్డికి ఆల్ ది బెస్ట్..!







# 'రైల్వే బిట్రగుంట' తలరాతను
# మార్చగలిగేది.. ఒక్క చంద్రబాబే!
## యువనేత లోకేష్ తలచుకుంటే.. పూర్వవైభవం!



***రైల్వే బిట్రగుంట' చాలామందికి తెలుసు. దేశంలోనే పేరుపొందిన లోకో షెడ్ ఇక్కడుండేది. వేలాదిమంది కార్మికులు పనిచేసేవారు. దీన్నే ఒకప్పుడు 'లిటిల్ ఇంగ్లాండ్' అనేవారు. రైల్వే కంటోన్మెంట్ అని కూడా పిలిచేవారు. కాలగతిలో డీజిల్, ఎలక్ట్రిక్ ఇంజన్ల రాకతో లోకోషెడ్ అవసరం తీరింది. సహజంగానే మూతపడింది. రైల్వేషెడ్ వల్ల ప్రఖ్యాతి పొందిన రైల్వే బిట్రగుంట ఇప్పుడు అజ్ఞాతంగా మిగిలింది.***

రైల్వే బిట్రగుంటకి వందల ఎకరాల భూములు, వందల కోట్ల రూపాయల ఆస్తులున్నాయి. అయితే, ఇప్పుడు గత వైభవం మాత్రం పూర్తిగా కోల్పోయింది. రైల్వే మినీ నగరంగా వెలిగిన బిట్రగుంట.. ఇప్పుడు సహాయం కోసం ఎదురుచూస్తోంది. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ దార్శనికుడు, పరిశ్రమల స్థాపనలో మొనగాడైన సీఎం చంద్రబాబు పరిపాలనలో కూడా నిస్సహాయంగానే బిక్కు బిక్కుమంటోంది. కొండలు, గుట్టల్లో సైతం పారిశ్రామిక చైతన్యాన్ని నింపుతున్న చైతన్యశీలి చంద్రబాబు దృష్టిని ఆకర్షించలేక పోతోంది. ఏపీని ప్రపంచ పటంలో అభివృద్ధిపథాన నిలబెట్టాలని అహరహం శ్రమిస్తున్న సీఎం చంద్ర బాబు దృష్టి తనపై పడాలని కోరుకుంటోంది. తండ్రికి తగ్గ తనయుడు.. యువనేత, మంత్రి లోకేష్‌కు పరిస్థితి తెలిస్తేచాలు.. ఇక బిట్రగుంట కళకళ లాడిపోతుంది. కొన్ని నెలల్లోనే వెలుగులు నింపుకుంటుంది. ఆ మంచిరోజు కోసం రైల్వే బిట్రగుంట దశాబ్దాలుగా ఎదురుచూపులు చూస్తూనే ఉంది.

### ఒకనాటి వైభవం.. ఇప్పుడు మసకబారిపోయింది

అది ఆంగ్లేయుల పాలనా కాలం. దేశంలో రైల్వే మార్గాల నిర్మాణం ఊపందుకొన్న సమయం. బొగ్గు ఇంజన్ల రిపేర్ కోసం ఒక షెడ్డు నిర్మించాలని ఆంగ్లేయ ప్రభుత్వం భావించింది. ఆ సమయంలో బిట్రగుంట వారి దృష్టికొచ్చింది. వేగంగా పనులు జరిపి 1885లో లోకోషెడ్ నిర్మాణాన్ని పూర్తిచేసింది. అక్కడ పని చేయడానికి ఆంగ్లేయ దొరలు తరలివచ్చారు. షెడ్డుకు ఆవలి భాగంలో ఉండేందుకు అవుట్‌హౌస్‌లతో పాటు పెద్ద బంగ్లాలు యూరోపియన్ శైలిలో నిర్మించారు. చుట్టుపక్కలున్న వారిని కార్మికులుగా చేర్చుకున్నారు. వారికోసం క్వార్టర్లు నిర్మించారు. సకల సౌకర్యాలు కల్పించారు. 1934లో రౌండ్‌హౌస్ నిర్మించారు. దీనికి 'రౌండ్ ఆఫ్ స్టీల్ హర్నెస్' అని పేరు పెట్టారు. ఇది స్టీమ్ ఇంజన్ దిశను మార్చే టర్న్‌టేబుల్. ఆ తర్వాత మార్షల్ యార్డ్ ఏర్పాటయింది. దేశంలోని రెండు అద్భుతమైన లోకో షెడ్లలో బిట్రగుంట కూడా ఒకటి.. నెల్లూరు, కడప, చిత్తూరు తదితర ప్రాంతాల నుంచి పలువురు కార్మికులుగా చేరారు. వారికోసం అన్ని సౌకర్యాలతో మరిన్ని ఇళ్ళను నిర్మించారు. అప్పట్లో ఆంగ్లేయులు ఇంజన్ పైలట్లు, గార్డులుగా ఉండేవారు. మంచి సౌకర్యాలు ఉండడంతో వారూ ఇక్కడే స్థిరపడ్డారు. వారికీప్రాంతం తెగ నచ్చేసింది. ఇంగ్లీష్, తెలుగు మీడియం స్కూళ్లు, హాస్పిటల్, అడుగడుగునా సాకర్, క్రికెట్ ఆడేందుకు మైదానాలు, స్నూకర్, టేబుల్ టెన్నిస్, షటిల్ కాక్ లాంటి ఇండోర్ గేమ్స్ కోసం రైల్వే ఇన్‌స్టిట్యూట్, అద్భుతమైన పార్క్.. ఇలా ఒకటేమిటి సమస్తం సమకూరిపోయాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక కూడా ఆంగ్లేయులు కొనసాగారు. వేలాదిమంది కార్మికులు రాత్రి పగలు పనిచేసేవారు. కార్మికుల పుణ్యమా అని చుట్టుపక్కల వ్యాపారాలు వెల్లువగా వెలిశాయి. లోకోషెడ్‌లో పెద్ద క్యాంటీనుండేది. అయినా రైల్వే స్థలంలో ఎన్నో ప్రైవేటు తాత్కాలిక హోటళ్ళు వచ్చాయి. టిఫిన్లు, టీ, కాఫీలు నాణ్యతగా దొరికేవి. చుట్టుపక్కల ప్రాంతాల వాళ్ళకి మంచి ఉపాధి కేంద్రంగా మారింది. బిట్రగుంట రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఆడిటోరియం సాంస్కృతిక నిలయంగా కూడా మారింది. నాటకాలు, సాంస్కృతిక ప్రదర్శనలు తరచూ జరిగేవి. ఇక్కడి క్రీడా మైదానాల వల్ల ఫుట్‌బాల్(సాకర్) ఆట బాగా రాణించింది. పదికి తగ్గకుండా ఉన్న ఫుట్‌బాల్ మైదానాలు జాతీయ, అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారులను తయారుచేశాయి. ప్రతి ఏడాది జాతీయస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ జరిగేది. ఆలిండియా క్యారమ్స్ పోటీలు కూడా జరిగేవి. బిట్రగుంట సాంస్కృతిక, క్రీడా వైభవాన్ని చవి చూసింది. ఇలా ఉండగా డీజిల్, ఎలక్ట్రిక్ ఇంజన్ల ప్రవేశం జరిగింది. దీంతో ఒక్కసారిగా బిట్రగుంట వైభవం మసకబారింది. ఇక్కడ పనిచేస్తున్న 2500 మందిలో సర్వీస్ చివరిలో ఉన్న కార్మికులను 'పి.ఓ.హెచ్ (పిరియాడికల్ ఓవర్ హాలింగ్), వ్యాగన్ రిపేర్ డిపోలో ఉంచారు. మిగతా వారిని క్రమేణ ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. వారు రిటైర్ అయ్యాక అవి కూడా మూతపడ్డాయి. చుట్టుపక్కల ప్రాంతాలవారికి ఉపాధి పోయింది. కార్మికుల ఇళ్ళు ఖాళీగా మారిపోయాయి. కార్యాలయాలు బోసిపోయాయి. ఒక్క మాటలో చెప్పాలంటే.. రైల్వే బిట్రగుంట కళ తప్పింది.

### బిట్రగుంటలో ఏమేమున్నాయి?

750 ఎకరాల విలువైన ఖాళీ స్థలం ఉంది. నిర్వహణ డిపోతో కూడిన కార్యాలయ భవనాలు, మార్షలింగ్ యార్డ్, వెయ్యి శాశ్వత నివాస గృహాలు, అద్భుతమైన మంచినీటి సరఫరా వ్యవస్థ వగైరా సౌకర్యాలెన్నో ఉన్నాయి. బిట్రగుంటలో అధునాతనమైన రైల్వే స్టేషన్ బిట్రగుంటను ఆనుకునే 16వ నెంబర్ జాతీయ రహదారి, దగదర్తి ఎయిర్‌పోర్ట్ 22 కిలోమీటర్లే. రామాయపట్నం పోర్ట్ 37కిలోమీటర్లు, కృష్ణపట్నం పోర్ట్ 74 కిలోమీటర్లు.. నెల్లూరు రైల్వేస్టేషన్ 45 కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంటాయి. రైల్వేపరంగా కోట్లాది రూపాయల ఆస్తులు, సౌకర్యాలు కలిగిన బిట్రగుంట ఒక బంగారు బాతు. ఇక్కడ ఏ పరిశ్రమ ఏర్పాటుచేసినా అది బంగారు గుడ్లను (లాభాలను) ఇస్తుంది. ఇక్కడ పనిచేసి రిటైర్ అయిన ఉద్యోగులు, కార్మిక నేతలు బిట్రగుంట అధోగతి గురించి కుమిలిపోతున్నారు. ఒక వెలుగు వెలిగిన రైల్వే మినీ నగరం ఎందుకు కొరగాకుండా పోతోందని ఆవేదన చెందుతున్నారు. బిట్రగుంట అభివృద్ధి కమిటీ నేతలు, కార్మిక నేతలు పలుమార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు నివేదించారు. అయినా నేటికీ ఎలాంటి ఫలితం లేదు.

### బాగుచేస్తే..ఎందరి జీవితాలో బాగుపడతాయి :

భారత్‌లో ప్రవేశించనున్న బుల్లెట్ రైళ్ల తయారీ యూనిట్, వందే భారత్ కోచ్‌ల తయారీ యూనిట్ చెన్నై ఐసిఎఫ్(ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ)కు అనుబంధంగా కోచ్‌ల తయారీ యూనిట్ చెన్నై ఐసిఎఫ్‌లో స్థలాభావం వల్ల ఉత్పత్తికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దానికి బదులుగా బిట్రగుంటలో ఉత్పత్తి ప్రారంభించవచ్చు. ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌ల తయారీ యూనిట్, గూడ్స్ వ్యాగన్ల తయారీ యూనిట్, ప్యాసింజర్ కోచ్‌ల తయారీ యూనిట్, రైల్వే స్లీపర్ తయారీ యూనిట్ ఇలా ఎన్నో నెలకొల్పుకోవచ్చు. బిట్రగుంటలో రైల్వే పరిశ్రమలు పెట్టడానికి పెద్దగా పెట్టుబడి అవసరంలేదు. వందల కోట్ల విలువైన భూములు ఉన్నాయి. కార్మికులు, అధికారులు ఉండేందుకు అన్ని సౌకర్యాలూ ఉన్నాయి. కావాల్సిందల్లా గట్టి లక్ష్యం. యంత్ర సామగ్రి. అద్భుత పరిపాలకుడిగా పేరుపొందిన ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్‌లు తలచుకుంటే దీని తలరాత మారిపోతుంది. దీనికి పూర్వవైభవం వస్తే.. ఆ నేతల పుణ్యమా అంటూ.. ఎందరికో ఉపాధి, ఉద్యోగాలు లభిస్తాయి. వారి కుటుంబాల్లో వెలుగుబాటలు పడతాయి. మరి ఆరోజు ఎప్పుడొస్తుందో.. మరి!...



**- ఫయాజ్** (ఫ్రీలాన్స్ జర్నలిస్ట్)

# జన'ఘన' నేత మోడీ
(మొదటిపేజీ తరువాయి)

ప్రసిద్ధి చెందారు. ఆ తర్వాత బీజేపీలో తిరుగులేని ఇమేజ్‌ను సంపాదించి ఏకంగా ప్రధాని అభ్యర్థిగా బీజేపీ మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ నుంచి గ్రీన్ సిగ్నల్ పొందారు. అప్పటి కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యూపీఏ ప్రభుత్వ అవినీతి, అక్రమాలను ఆయుధాలుగా చేసుకుని ప్రచారంలో మోడీ చెలరేగిపోయారు. దేశవ్యాప్తంగా తన మాటల మంత్రదండంతో ప్రజలను కట్టిపడేశారు. తిరుగులేని మెజారిటీతో ఎన్డీయే పక్ష నేతగా ఎన్నికై మూడుసార్లు ప్రధాని పదవిని అధిరోహించారు. 130 ఏళ్ల కాంగ్రెస్‌కు చివరికి లోక్‌సభలో ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేయగలిగారు. పాకిస్థాన్‌ని కట్టడి చేయడం, కొత్త పన్నుల చట్టం జీఎస్టీకి పురుడుపోయడం, పంచవర్ష ప్రణాళికలు రద్దుచేసి వాటిస్థానంలో నీతి ఆయోగ్‌ను తీసుకురావడం, పాతనోట్లను రద్దుచేసి కొత్త నోట్లను అమల్లోకి తేవడం, అయోధ్యలో రామమందిర నిర్మాణం చేపట్టడం, కశ్మీరుకి ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తున్న 371 ఆర్టికల్ రద్దుచేయడం తదితర చారిత్రక నిర్ణయాలతో పాలనను పరుగులు పెట్టించారు. పుష్కర కాలంగా ఎక్కడా అవినీతికి చోటులేకుండా, ఎలాంటి ఆరోపణలకు అవకాశం కల్పించకుండా నీతివంతమైన పాలనకు కేరాఫ్ అడ్రస్‌గా మారారు. ఇలాంటి పరిస్థితుల్లో తాజాగా దేశంలో విరామం లేకుండా సుదీర్ఘకాలం ప్రభుత్వాధినేతగా (8,931 రోజులు) పనిచేసిన రాజకీయ నాయకుడిగా మోడీ సరికొత్త చరిత్రను లిఖించారు. తద్వారా ఆయన అస్సాం మాజీ ముఖ్యమంత్రి పవన్ చామ్లింగ్ రికార్డు(8,930 రోజులు)ను అధిగమించారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా, తర్వాత ప్రధానమంత్రిగా మోడీ గత 25ఏళ్లకు పైగా ప్రొటోకాల్ గౌరవం పొందుతున్న ఏకైక వీవీఐపీగా దేశంలో కొనసాగుతుండడం గమనార్హం. ఒక్కమాటలో చెప్పాలంటే మోడీ రికార్డుల వెంట వెళ్తున్నారనడం కంటే రికార్డులే మోడీ పాదాక్రాంతమై వస్తున్నాయనడంలో సందేహం లేదు. ఇదే స్థాయిలో మోడీ మేనియా కొనసాగితే భారత్‌లో వచ్చే దశాబ్దం కూడా మోడీదే అవుతుందని విశ్లేషకులు వ్యాఖ్యానించడం గమనార్హం.

జయహో నమో...!

## టూకీగా...



### బోగోలులో ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ

బోగోలు మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఈనెల 24న మండల ప్రత్యేక అధికారిణి సుమన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులను ఇబ్బందిపెట్టకుండా కొనుగోళ్ళు జరపాలని ఆయా కేంద్రాల్లోని వారికి, రైసుమిల్లర్లకు సూచించారు. తహశీల్దార్ శ్రీనివాసులురెడ్డి, ఎంపీడీఓ సుబ్రహ్మణం, కావలి సివిల్‌సప్లయిస్ డీటీ విజయమ్మ పాల్గొన్నారు.

### కోటలో నీటి నాణ్యతపై శిక్షణ

మండల కేంద్రమైన కోటలో ఈనెల 24న గ్రామీణ నీటి సరఫరా విభాగం డీఇ నందకుమార్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు నీటి నాణ్యత పరీక్షల్లో శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లో ఉన్న మంచినీటి పథకాలు హ్యాండ్‌బోర్లలో నీటినాణ్యత పరిశీలించి నీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. ఎంపీడీఓ దిలీప్‌కుమార్, ఏఇ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

### ఏపూరులో ఎర్రచందనం దుంగల పట్టివేత

రాపూరు మండలం ఏపూరులో రాజంపేటకి చెందిన టాస్క్‌ఫోర్స్ అధికారులు ఈనెల 24వ తేదీ రాత్రి దాడులు చేసి, అక్రమరవాణాకి సిద్ధంగా ఉన్న 13 ఎర్రచందనం దుంగలను పట్టుకున్నారు. వాటి విలువ సుమారు 1.5 లక్షలు ఉంటుందని భావిస్తున్నారు. అందుకు బాధ్యులైన ఇద్దరు నిందితులని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

### కొత్తపల్లిలో ఉచితపశువైద్య శిబిరం

కావలి రూరల్‌లోని కొత్తపల్లిలో ఈనెల 24న ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. 34 దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. ఏఎంసీ ఛైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య ఈ శిబిరాన్ని ప్రారంభించి, ఏఎంసి డైరెక్టర్ రమణమ్మతో కలసి మందులు పంపిణీచేశారు. పశువైద్యసంచాలకులు డాక్టర్ వైవి కామేశ్వరరావు, పశువైద్యులు నాయక్ పాల్గొన్నారు.

### అప్పసముద్రంలో లేగదూడల ప్రదర్శన

ఉదయగిరి మండలం అప్పసముద్రం గ్రామంలో ఈనెల 24న మేలుజాతి లేగదూడల ప్రదర్శన జరిగింది. రాష్ట్రీయ గోకుల్‌మిషన్, జిల్లా పశుగణాభివృద్ధిశాఖల ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రదర్శనలో, లేగదూడలను శాస్త్రీయంగా పెంచిన పాడిరైతులను గుర్తించి బహుమతులిచ్చారు. ఆ శాఖల అధికారులు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ ఎస్ శశిధర్ పర్యవేక్షించారు.

### ఆర్సీ పాళెంలో.. కరెంటోళ్ళ జనబాట

కావలి రూరల్ మండలం ఆర్సీ పాళెంలో ఈనెల 24న కరెంటోళ్ల జనబాట కార్యక్రమం జరిగింది. విద్యుత్‌శాఖ ఎస్ఇ రాఘవేంద్రం సారధ్యంలో అధికారులు గ్రామస్తులతో మాట్లాడి విద్యుత్ సమస్యలను తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషిచేస్తామని చెప్పారు. కావలి ఇఇ బెనర్జీ, ఏఇ చేజర్ల శ్రీనివాసులురెడ్డి, టెక్నికల్ ఇఇ భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

### దేవరదిబ్బలో క్షయవ్యాధిపై అవగాహన

ముత్తుకూరు మండలంలోని దేవరదిబ్బ సంఘం పంచాయతీలో ఈనెల 24న ఎస్ఇఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ కంపెనీవారి సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా క్షయవ్యాధి పట్ల అవగాహన కలిగించారు. అపోలో టెలిమెడిసిన్ నెట్ వర్కింగ్ ఫౌండేషన్ వారి సహకారంతో ఆ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామస్తులకు వివరించారు.

### దుత్తలూరులో గ్యాస్‌గోడౌన్ పరిశీలన

దుత్తలూరులోని ఇండేన్ గ్యాస్ గోడౌన్‌ను తహశీల్దార్ నాగరాజు ఈనెల 24న తనిఖీ చేసి, ప్రజలకు గ్యాస్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. గ్యాస్ సిలిండర్ల పంపిణీ పారదర్శకంగా ఉండాలని, ముందుగా బుక్ చేసుకున్నవారికి ప్రాధాన్యత ప్రకారం గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయాలని సూచించారు.

### కొండ్లపూడిలో వరిరైతులకు సూచనలు

నెల్లూరు రూరల్ మండలం కొండ్లపూడిలో ఈనెల 24న వ్యవసాయాధికారి నాగమోహన్ రైతులతో సమావేశమై, వరిలో కాండం తొలిచే పురుగుల నివారణ పట్ల తగు సూచనలు చేశారు. కేవీకే శాస్త్రవేత్త లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# కృషితో నాస్తి దుర్భిక్షం..!



"కృషి ఉంటే.. మనుషులు ఋషులవుతారు.. మహాపురుషులవుతారు"
అన్న మాటలని అక్షర సత్యం చేస్తూ.. వ్యాపార, ఆధ్యాత్మిక, సినీ, సామాజిక సేవా రంగాలలో
తన విజయ ప్రస్థానాన్ని కొనసాగిస్తూ, ఆయన సాధిస్తున్న ఘన విజయాలకి గుర్తుగా..




మాకు అత్యంత ఆప్తుడు, ఆత్మీయుడు

## ఆల్తూరు మహేష్‌రెడ్డి

105 సంవత్సరాల ఘనమైన చరిత్ర కలిగిన ప్రఖ్యాత విశ్వవిద్యాలయం
"తిలక్ మహారాష్ట్ర విద్యాపీఠ్" నుండి అత్యంత ప్రతిష్టాత్మకమైన
గౌరవ డాక్టరేట్ అందుకున్న సందర్భంగా మా హార్ధిక శుభాకాంక్షలు.

**బొమ్మిరెడ్డి సురేష్‌రెడ్డి**
**బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి**
**బొమ్మిరెడ్డి సునీల్‌రెడ్డి**

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com